విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
అనుభవం ఉన్న విలేకరులు కావలెను..
తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు
అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై
పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే
సంప్రదించండి..సెల్ నెం:9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

టీవీ రిపోర్టర్లు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను.
ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం:9700370499
A.P VISION TV
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శనివారం 09-08-2025 | సంపుటి : 11 | సంచిక : 186 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**పాడేరులో పెద్ద ఎత్తున గిరిజన సంక్షేమ కార్యక్రమాలు**

**హాజరువుతున్న సిఎం చంద్రబాబు నాయుడు**

**గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**రూ.7557 కోట్లు షెడ్యూల్డ్ -ట్రైబ్ కాంపోనెంట్ కింద ఖర్చు**



అమరావతి,ఆగస్ట్ 8: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే గిరిజన ప్రాంతాల్లో నూతన అధ్యాయం ఆరంభమైంది. ఏజెన్సీ జిల్లాల్లోని ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యం కృషి చేస్తోంది. గతంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరులో జరుగనున్న కార్యక్రమానికి హాజరు కానున్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ- కృత్రిమ మేధస్సు, ఆదివాసీల భవిష్యత్తు అనే థీమ్ తో ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ గిరిజన దినోత్సవ నిర్వహణకు పిలుపునిచ్చింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా పాడేరులో అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. పాడేరు మండలం వంజంగి గ్రామంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. తొలుత మోదకొండమ్మ ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం స్థానిక గిరిజన సంప్రదాయ వేడుకలకు హాజరు అవుతారు. ఆదివాసీల ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాలను ముఖ్యమంత్రి స్వయంగా తెలుసుకోనున్నారు. అనంతరం కాఫీ ప్లాంటేషన్ పెంపకందారులతో సీఎం మాట్లాడనున్నారు. ఆ తర్వాత లగిసపల్లె వద్ద ఏర్పాటు- చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం అక్కడి నుంచే శంకుస్థాపన చేయనున్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ప్రాజెక్టులకు సంబంధించిన అంశంపై సీఎం సమక్షంలో ఎంఓయూలను కుదుర్చుకోనున్నారు. అనంతరం కొద్దిసేపు పార్టీ శ్రేణులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలు, ఆవాసాలను ఏజెన్సీలోని ప్రధాన కేంద్రాలు, ఇతర మైదాన ప్రాంతాలతో అనుసంధానించేలా ప్రభుత్వం రహదారుల నిర్మాణ ప్రాజెక్టుల్లో వేగం పెంచింది. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు నిర్మాణంతో పాటు- ఆదివాసీల ప్రాంతాలు, నివాసాలకు కనెక్టివిటీ- కోసం రూ. 2404 కోట్లు- ఖర్చు చేయనుంది. వచ్చే ఐదేళ్లలో 2075కు పైగా గిరిజన గ్రామాలకు, నివాసాలను రోడ్లు, వంతెనలతో అనుసంధానించాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రోడ్ల కారిడార్లను రూ.41 కోట్లతో చేపట్టనుంది. ఐటీ-డీఏ చింతూరులో కమ్యూనిటీ- హెల్త్ సెంటర్ ను 50 నుంచి 100 పడకల ఆస్పత్రికిగా మార్చడంతో పాటు- సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్ పురం, శ్రీశైలం ఐటీ-డీఏ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ- ఆస్పత్రుల నిర్మాణాల కోసం రూ.50 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.




# 14 మంది ఎస్‌పీఎస్ అధికారులకు ఐపీఎస్‌లుగా పదోన్నతి..

అమరావతి:కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు చెందిన 14 మందికి ఐపీఎస్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ..కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐపీఎస్‌లుగా ఎన్నికైనా అభ్యర్థులు ఒక సంవత్సరం పాటు ప్రొబేషన్‌లో ఉండాలని సూచించింది. యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన పదోన్నతి కమిటీ పదోన్నతులకు ఆమోదం తెలిపింది.2010 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన చౌడేశ్వరి, లక్ష్మీనారాయణ, ఈశ్వర్‌రావు, హిమావతి, లావణ్య లక్ష్మి, వెంకటరత్నం, లత మాధురి, సురేష్ బాబు, కరీముల్లా షరీఫ్, సత్తిబాబు, సుప్రజ, కృష్ణ ప్రసన్న, శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌లకు కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి ఇచ్చింది. దీనికి సంబంధించిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఇవాళ కమిటీ విడుదల చేసింది.



# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎం ఉజ్వల యోజన కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. దాని కోసం రూ.12,060 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పింది. అసోం, త్రిపుర రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీకి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. రూ.7,250 కోట్ల చొప్పున ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. సాంకేతిక విద్య కోసం రూ.4,200 కోట్లు ప్రకటించినట్లు కేంద్రం వెల్లడించింది.ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల అప్‌గ్రేడ్‌కు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం ప్రకటిచింది. దేశీయ ఒఖఉలో నష్టాలకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు పరిహారం చెల్లించేందుకు రూ.30,000 కోట్లు కేటాయించినట్లు వివరించింది.

మరక్కనం - పుదుచ్చేరి 4-లైన్ హైవే కోసం రూ. 2,157 కోట్లు కేటాయింపు జరిగినట్లు మోదీ సర్కార్ చెప్పుకొచ్చింది. అనంతరం అమెరికా విధించిన 50 శాతం సుంకాలపై కేబినెట్‌లో చర్చ జరిగింది.అమెరికా సుంకాలకు భారత్ దీటైన కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోళ్లు నిలిపివేసినట్లు భారత్ ప్రకటించింది. ఇప్పటికే అమెరికా క్షిపణుల కొనుగోళ్లు నిలిపివేసినట్లు భారత్ తెలిపింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అమెరికా పర్యటన కూడా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఇటీవల భారత్‌పై 50 శాతం టారిఫ్ విధిస్తూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# సీఎం స్టాలిన్ కీలక నిర్ణయం..

**జాతీయ విద్యా విధానానికి స్వస్తి**

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం, తమిళనాడు మధ్య హిందీ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో స్టాలిన్ జాతీయ విద్యా విధానానికి స్వస్తి పలికారు. తమిళనాడు రాష్ట్ర ప్రజల కోసం సొంతంగా స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని ఆవిష్కరించారు. కేంద్రం తీసుకొచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి కౌంటర్‌గా స్టాలిన్ స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని ప్రవేశపెట్టబోతున్నారు.చెన్నైలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో నూతన స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని స్టాలిన్ శుక్రవారం ఆవిష్క రించారు. కేంద్రం చెబుతు న్న త్రిభాషా సూత్రాన్ని తోసిపుచ్చుతూ ద్విభాషా అజెండాతో ఈ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించారు. 2022లో రిటైర్డ్ జడ్జి జస్టిస్ మురుగేశణ్ నేతృత్వంలో 14 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, నూతన విద్యావిధానాన్ని రూపొందించాలని ఆదేశించగా, ఈ కమిటీ గతేడాది తమ ప్రతిపాదనలను సీఎం స్టాలిన్‌కు అందజేసింది. మురుగేశణ్ కమిటీ అందించిన రిపోర్టును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తాజాగా ఇవాళ స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని ఆవిష్కరించారు స్టాలిన్.మాతృ భాషతో పాటు ఇంగ్లీష్, ఏఐ, సైన్స్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నీట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం.. కొత్త విద్యావిధానంలో ప్రవేశ పరీక్షకు బదులుగా మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. 11, 12వ తరగతుల మార్కుల ఆధారంగా యూజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. 3, 5, 8 తరగతులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలన్న ప్రతిపాదనను కమిటీ తోసిపుచ్చింది.

# పులివెందుల ఎన్నికపై జగన్ భయపడుతున్నాడు : మంత్రి సవిత



కడప: పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని మంత్రి సవిత అన్నారు. ఆమె ఇవాళ(శుక్రవారం) మీడియాతో మాట్లాడారు. వైసీపీకి పులివెందుల జెడ్పీటీసీ ఓడిపోతామని భయం పట్టుకుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు.తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు చించడం వైసీపీ నాయకుల అవివేకానికి నిదర్శనమని మంత్రి సవిత విమర్శించారు. పోలీసులను అసభ్యకరంగా మాట్లాడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వైసీపీ నాయకులు పులివెందుల ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు పేర్కొన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌పై జగన్ దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పులివెందులలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. వివేకానంద రెడ్డి జయంతికి కుటుంబ సభ్యులు రావాలన్న భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తామే గెలుస్తామని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు.

# పులివెందుల ఎన్నికపై జగన్ భయపడుతున్నాడు : మంత్రి సవిత

కడప: పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని మంత్రి సవిత అన్నారు. ఆమె ఇవాళ(శుక్రవారం) మీడియాతో మాట్లాడారు. వైసీపీకి పులివెందుల జెడ్పీటీసీ ఓడిపోతామని భయం పట్టుకుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు.తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు చించడం వైసీపీ నాయకుల అవివేకానికి నిదర్శనమని మంత్రి సవిత విమర్శించారు. పోలీసులను అసభ్యకరంగా మాట్లాడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వైసీపీ నాయకులు పులివెందుల ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు పేర్కొన్నారు.

# బీజేపీకి అనుకూలంగా ఎన్నికల సంఘం..

**రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని, ఈ ఎన్నికల్లో న్యాయం నిలవాలంటే అధికార యంత్రాంగం కక్ష సాధింపులు చేయకుండా వ్యవహరించాలంటూ రాహుల్ గాంధీ హితవు పలికారు. అంతేకాదు, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో మీరు రాజ్యాంగాన్ని తాకాలని అనుకుంటే, ఒకసారి ఆలోచించాలని సూచించారు.ఈ విషయంలో మీరు ఎంత తెలివిగా దాక్కున్నా, మేము మిమ్మల్ని పట్టుకుంటామన్నారు. ఇందుకు కొంచెం సమయం పట్టొచ్చు, కానీ తప్పకుండా పట్టుకుంటామని రాహుల్ గాంధీ ఎన్నికల సంఘానికి వార్నింగ్ ఇచ్చారు.



# చొరబాటుదారులే వారి ఓటు బ్యాంకు.. అమిత్ షా ఆగ్రహం

(బీహార్), ఆగస్టు 8 : బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను వ్యతిరేకించడాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. కొన్ని పార్టీలు దేశప్రయోజనాల్ని పక్కన పెట్టి, ఓటు బ్యాంకు పాలిటిక్స్ కు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఇదంతా జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇవాళ (శుక్రవారం) అమిత్ షా బీహార్ లో పర్యటించారు. సీతామర్హి లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా బీహార్‌లో ప్రతిపక్ష పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్ లపై అమిత్ షా విరుచుకుపడ్డారు.చొర బాటుదారులు వారి ఓటు బ్యాంకు అని.. అందుకే ప్రతిపక్ష పార్టీలు సాఐఆర్ ని వ్యతిరేకిస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. ఈ ఎస్ఐఆర్ అనే ప్రక్రియ దేశంలో మొదటి సారి జరగడం లేదని, ఈ విధానాన్ని మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారని కేంద్ర మంత్రి చెప్పారు. 'బీహార్‌లో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. నేను ఇక్కడికి వచ్చేముందు నన్ను విలేకర్లు సాఐఆర్ గురించి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు. అయితే, దీని గురించి నేను ప్రజలను అడగాలనుకుంటున్నాను. మనం ఓటర్ల జాబితా నుండి వలసదారులను



తొలగించకూడదా? లాలూ ప్రసాద్ యాదవ్ ఎవరిని రక్షించాలనుకుంటున్నారు? బయటి నుండి వచ్చి బీహార్ ప్రజల ఉద్యోగాలు లాక్కునే బంగ్లాదేశీయులను మీరు రక్షించాలనుకుంటున్నారా?' అంటూ అమిత్ షా ఆర్జేడీ టార్గెట్ గా ప్రశ్నలు సంధించారు.అటు, కాంగ్రెస్ పైనా అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'రాహుల్ గాంధీ ఈ ఓటు బ్యాంకు రాజకీయాలను ఆపాలి. దేశంలో మొదటిసారి జరగడం లేదు..

## సంపాదకీయం

శనివారం 09-08-2025

# బీసీలపై ఒక్కసారి ప్రేమ...

హైదరాబాద్, ఆగస్ట 08,కుల రాజకీయాలు బాగా పెరిగిపోయాయి కాబట్టి ఓసీల్లో కూడా ఫలానా కులంవారి ఓట్లు ఎన్ని ఉన్నాయి, బీసీల్లో ఫలానా వర్గం వారి ఓట్లు ఎన్ని ఉన్నాయనే లెక్కలు బయటకు తీసిమరీ గెలుపు లెక్కలు వేసుకుంటారు నాయకులు. ఈ లెక్కలు ఎలా ఉన్నా.. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో బీసీలకు మెజార్టీ ఓట్లు ఉంటాయి. గంపగుత్తగా బీసీ ఓట్లు కొల్లగొడితే చాలు ఆ అభ్యర్థి విజయం గ్యారెంటీ. కానీ అది అసాధ్యం అని అందరికీ తెలుసు. అందుకే ఒక్కోసారి ఒక్కో రకంగా బీసీలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తుంటాయి రాజకీయ పార్టీలు. తెలంగాణలో బీసీ రాజకీయాలు.. తెలంగాణకు ఒక ఎస్సీని తొలి ముఖ్యమంత్రిగా చేస్తామని చెప్పి అప్పట్లో ఆ సామాజిక వర్గానికి మరింత దగ్గరయ్యారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కానీ పార్టీ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ఎన్ని పిల్లిమొగ్గలు వేశారో అందరికీ తెలుసు. ఇక అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఆ పార్టీ చేసింది శూన్యం అనే చెప్పాలి. కాంగ్రెస్ విషయానికొస్తే.. అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి అతి పెద్ద సాహసం చేసింది కాంగ్రెస్. అంతే కాదు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి, కేంద్రానికి పంపించారు సీఎం రేవంత్ రెడ్డి. అక్కడితో కథ సుఖాంతం కాలేదు. ఆ రిజర్వేషన్లకు కేంద్రం మోకాలడ్డింది. దీంతో మళ్లీ గొడవ మొదలైంది. బీసీలకోసం పాటుపడేది మేమంటే మేమంటూ అన్ని పార్టీలూ చెప్పుకుంటున్నాయి. అదే సమయంలో బీసీలకు అన్యాయం చేస్తోంది మీరంటే మీరంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు నేతలు. కాంగ్రెస్ పాత్ర ఏంటి..? బీసీ రిజర్వేషన్ బిల్లుని అసెంబ్లీలో ఆమోదింపజేసి కేంద్రానికి పంపించింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ రిజర్వేషన్ పై రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే చట్టం చెల్లుబాటవుతుంది. కానీ రాష్ట్రపతి కేంద్రం అనుమతితోనే ఆ పనిచేయాలి, అంటే ఇక్కడ కేంద్రానికి బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచడం ఇష్టం లేదని చెప్పాలి. దీంతో కాంగ్రెస్ పోరుబాటకు సిద్ధమైంది. అవసరమైతే ఢిల్లీలో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈలోగా తెలంగాణలో స్థానిక ఎన్నికలు రాబోతుండటంతో తమ పార్టీ తరపున బీసీలకు 42శాతం సీట్లు కేటాయించడానికి ఆయన సిద్ధమవుతున్నారు. అదే జరిగితే, బీసీల ఓట్లు కాంగ్రెస్ వైపు మరలుతాయనడంలో సందేహం లేదు. బీజేపీ ఏమంటోంది? బీసీ బిల్లుని అడ్డుకుంటున్నారన్న అపవాదు బీజేపీపై ఉంది. అయితే తెలివిగా ఆ పార్టీ తప్పించుకోవాలని చూస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ప్రకారం 42 శాతంలో ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కలిపే ఉన్నాయని, కేవలం బీసీలకు 32శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతాయని అంటున్నారు బీజేపీ నేతలు. అందుకే తాము ఆ బిల్లుని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ముస్లింలకు కేటాయించిన 10శాతం రిజర్వేష్లు తీసేసి కేవలం బీసీలకే 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వెంటనే ఆ బిల్లుకి ఆమోద ముద్ర వేయిస్తామని అంటున్నారు. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం అంటున్న బీజేపీ, బీసీలపై ప్రేమ చూపిస్తున్నట్టుగా కలరింగ్ ఇస్తోంది. బీఆర్ఎస్ వాదన ఏంటి? బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో బీఆర్ఎస్ సందిగ్ధంలో ఉంది. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, బీజేపీ బిల్లు ఆమోదానికి అడ్డుపడుతోందని అంటోంది బీఆర్ఎస్. తమ హయాంలో బీసీ రిజర్వేషన్ గురించి ఎందుకు ఆలోచించలేదనే ప్రశ్న వస్తే మాత్రం సమాధానం చెప్పడానికి బీఆర్ఎస్ నేతలు తడబడుతున్నారు. బీసీ గర్జన అంటూ హడావిడి చేశారు కానీ, చివరకు చప్పబడ్డారు. కొత్తగా కవిత బీసీ రాగం అందుకోవడం కూడా పరోక్షంగా బీఆర్ఎస్ ని ఇరుకునపెడుతోంది. బీఆర్ఎస్ 9 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు పూలే విగ్రహం ఊసే ఎత్తని కవిత, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ నాయకుల విగ్రహాలంటూ హడావిడి చేయడం హాస్యాస్పదంగా మారింది. ఇక బీసీ బిల్లు విషయంలో కవిత కాంగ్రెస్ ని సమర్థిస్తున్నా.. అది చట్టంగా మారకపోవడంలో ఆ పార్టీ ఉదాసీనత కూడా ఉందని అంటోంది. మూడు పార్టీల్లో ఎవరికి బీసీలపై ఎక్కువ ప్రేమ ఉంది, ఎవరిది కపట ప్రేమ అని చెప్పడం కాస్త కష్టమే. కానీ అన్ని పార్టీలకు బీసీల ఓట్లు మాత్రం కావాలి, వాటి ద్వారా వచ్చే ప్రతిఫలాన్ని అనుభవించాలి అని ఉంటుంది. అయితే ఇక్కడ కాంగ్రెస్ ముందడుగు వేయడం మిగతా పార్టీలకు ఇబ్బందిగా మారింది. బీసీ బిల్లు చట్టంగా మారితే కచ్చితంగా అది కాంగ్రెస్ ఘనతే అవుతుంది. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ అన్నీ తానై చేసినా.. తెలంగాణలో 9 ఏళ్లు అధికారానికి దూరం కావాల్సి వచ్చింది. ఇటు ఏపీలో పార్టీ పూర్తిగా శవాసనం నుంచి కదలనంటోంది. బీసీ బిల్లు విషయంలో అయినా క్రెడిట్ తీసుకోవడంలో కాంగ్రెస్ ముందుంటుందో లేక వెనకబడుతుందో చూడాలి.

## భారత్ పైనే ఎందుకు కోపం

అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. దీంతో ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలతో కలిపి మొత్తం సుంకాలు 50 శాతం కానున్నాయి.అదనపు సుంకాలకు ఆదేశాలిస్తూ, "భారత ప్రభుత్వం ఇప్పటికీ రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది"అని వైట్‌హౌస్ పేర్కొంది. అందుకే అదనపు సుంకాలు విధించినట్లు తెలిపింది.ఈ అదనపు సుంకాలు ఆగస్ట్ 27 నుంచి అమల్లోకి వస్తాయి.రష్యా నుంచి చమురు కొనుగోళ్లలో భారత్ కంటే చైనా ముందున్నప్పటికీ, ప్రత్యేకంగా భారత్‌నే అమెరికా ఎందుకు లక్ష్యం చేసుకుందనేదే ఇక్కడి ప్రశ్న. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహానికి ఇతర అనేక కారణాలున్నాయని నిపుణులు భావిస్తున్నారు.అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సమూహం బ్రిక్స్. ఇందులో భారత్, చైనా, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇరాన్, ఇథియోపియా, ఇండోనేషియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భాగస్వాములుగా ఉన్నాయి.ఈ దేశాలన్నీ డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నాయి. అది అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మింగుడుపడడం లేదు. బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామంటూ ఎప్పటికప్పుడు బెదిరిస్తూ వస్తున్నారు.బ్రిక్స్ దేశాలు తమ సొంత కరెన్సీని తీసుకొస్తే, అమెరికాతో వాణిజ్యానికి వీడ్కోలు పలికేందుకు కూడా సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించిన నాటి నుంచి చమురును రూబుల్స్(రష్యన్ కరెన్సీ)లో చైనా కొనుగోలు చేస్తోంది .యూఎస్ కాంగ్రెషనల్ రీసర్చ్ సర్వీస్ ప్రకారం, 2022లో అంతర్జాతీయ వాణిజ్యంలో దాదాపు సగభాగం అమెరికన్ డాలర్లలోనే జరిగింది. డాలర్ ద్వారానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఆధిపత్యం చెలాయిస్తోంది.ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ జియోపాలిటిక్స్ ప్రొఫెసర్ ఫైసల్ అహ్మద్, బ్రిక్స్ అంతకంతకూ విస్తరిస్తోందని భావిస్తున్నారు.ఇప్పుడు ఇరాన్ కూడా ఇందులో భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ దేశాల మధ్య స్థానిక కరెన్సీ గురించి చర్చ జరుగుతోంది. దాని గురించే అమెరికా భయపడుతోంది. వీళ్లు బలంగా ఉంటే డాలర్ బలహీనమవుతుంది. మరిన్ని సుంకాలు విధిస్తే, ఆర్థిక వ్యవస్థకు హాని కలుగుతుంది. అప్పుడు అమెరికా ఆధిపత్యం అలాగే కొనసాగుతుంది" అని ఆయన అన్నారు.మరోవైపు, థింక్ ట్యాంక్ అయిన గేట్‌వే హౌస్‌లో ఫెలోగా ఉన్న నైనిమా బసు "బ్రిక్స్‌లోని ఇతర దేశాలు చాలా మార్పులు తీసుకురావాలనుకుంటున్నాయి, కానీ భారత్ అలసత్వ వైఖరి కారణంగా వారు అలా చేయలేకపోతున్నారు. అమెరికాతో సంబంధాల కారణంగా భారత్ బ్రిక్స్‌ను బలహీనపరుస్తోందని పదేపదే ఆరోపణలు ఎదుర్కొంటోంది" అన్నారు."అమెరికాపై కేవలం భారత్ ఒక్కటే కాదు, ఇతర బ్రిక్స్ దేశాలు కూడా ఆధారపడ్డాయి. అయినా, అమెరికా నుంచి భారత్ ఇలాంటి సుంకాలను ఎదుర్కొంటోంది" అని తెలిపారు.అమెరికా చాలా ఏళ్లుగా భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. అధ్యక్షుడు ట్రంప్ మొదటి పదవీకాలంలోనూ ఈ ప్రయత్నాలు జరిగాయి, కానీ ఫలించలేదు.వాణిజ్య ఒప్పందం అమెరికాకు భారత మార్కెట్లను తెరుస్తుందని ట్రంప్ విశ్వసిస్తున్నారు, కానీ కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.భారత్, అమెరికా మధ్య వ్యవసాయ వాణిజ్యం దాదాపు 8 బిలియన్ డాలర్లు(అంటే సుమారు 70 వేల కోట్ల రూపాయలు). భారత్ బియ్యం, సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేస్తుంది. అమెరికా నుంచి డ్రైఫ్రూట్స్, యాపిల్స్, పప్పుధాన్యాలను దిగుమతి చేసుకుంటోంది.అమెరికాకు రాయితీలు కల్పిస్తే, ఇప్పుడున్న మాదిరిగా ఎం.ఎస్.పీ (కనీస మద్దతు ధర)కు రైతుల వద్ద నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయలేమని, ఇది దేశంలో పెద్ద సమస్యగా మారొచ్చని నిపుణులు భావిస్తున్నారు.షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్ట్ 31 నుంచి సెప్టెంబర్ 1 వరకూ ఈ పర్యటన జరగనుంది.గతేడాది అక్టోబర్‌లో, రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ అయ్యారు.2025 జూన్‌లో, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా బీజింగ్‌లో పర్యటించారు. ఆ తర్వాత విదేశాంగ మంత్రి డాక్టర్ జైశంకర్ కూడా చైనా వెళ్లారు.భారత్, చైనా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని జామియా మిలియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ రేష్మీ కాజీ అన్నారు.''ఏదైనా దేశం అమెరికాను సవాల్ చేస్తోందంటే, అది చైనానే. ఒకప్పుడు ఈ ప్లేస్‌లో రష్యా ఉండేది. కానీ ఇప్పుడు చైనాతోనే అమెరికాకు అతిపెద్ద ముప్పు. చైనాను ఎదుర్కోవాలంటే అమెరికాకు భారత్ అవసరం."''భారత్, చైనా మధ్య కైలాష్ మానసరోవర్ యాత్ర మళ్లీ మొదలైంది. ప్రధాని మోదీ చైనా పర్యటన తర్వాత, బీజింగ్ - దిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీస్ కూడా ప్రారంభం కావొచ్చని అనుకుంటున్నా. చైనా ఎప్పటి నుంచో ఇది కోరుతోంది. రానున్న రోజుల్లో వీసా పరిమితులను కూడా ఎత్తేయచ్చు'' అని నైనిమా బసు అన్నారు.'ఇదంతా అమెరికాకు మింగుడుపడడం లేదు, రష్యా నుంచి చమురు కొంటున్నారంటూ సాకులు చెబుతోంది. ఒకవేళ రష్యా నుంచి చమురు కొనడాన్ని ఆపేస్తే భారత్‌పై అమెరికా సుంకాలు విధించదా?" అని ఆమె ప్రశ్నించారు.'ప్రధాని మోదీ అమెరికా వెళ్లిన సమయంలో, ట్రంప్ భారత్‌ను టారిఫ్ కింగ్ అని సంబోధించారు. అందువల్ల సుంకాలు విధింపును నిలువరించడం కష్టం. అయితే, దానిని కనీసం పరిమితుల్లోపు ఉంచొచ్చు" అని ఆమె అన్నారు.భారత్ విషయంలో ఈసారి ట్రంప్ కఠినంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. గత పదవీ కాలంలో కాస్త మృదువుగా వ్యవహరించినట్లు కనిపించారు.

## పెనాల్టీలు కాదు..బహుమతులు

కరీంనగర్, ఆగస్టు 8, వాహనం నడిపే వారైనా ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. లేదంటే భారీగా జరిమానాలు విధిస్తారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే.. మీ జేబులు గుల్ల కావాల్సిందే. అయితే ఇక్కడ జరిమానాలు ఒక్కటే చెల్లిస్తే సరిపోతుంది అనుకుంటే పొరపాటే.. చాలా మంది కూడా ఇలానే ఆలోచిస్తారు. అయితే హెల్మెట్ లేకుండా వాహనం నడిపే సమయంలో పొరపాటున ప్రమాదం జరిగితే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. అప్పుడు ఎంత జరిమానా చెల్లించినా ప్రాణాలు తిరిగి రావు. వీటి అవసరంపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాలతో పాటు.. హెల్మెట్ ధరించిన వారికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ద్వి చక్ర వాహనం నడిపిన వారు ఎవరైనా హెల్మెట్ పెట్టుకోవాల్సిందే. ఇలా చేయని వారికి జరిమానాలు విధించడం జరుగుతుంది. అయితే కొంతమంది వీటిని ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో భాగంగానే వాడుతున్నారు. దీని వల్ల ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుంది. ఇటువంటి ఘటనలు ఇటీవల హైదరాబాద్‌తో పాటు.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చోటు చేసుకుంటున్నాయి. అయితే.. హెల్మెట్ ధరించడం వల్ల వచ్చే ప్రయోజనాల గురించి ట్రాఫిక్ పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు. అంతే కాకుండా.. హెల్మెట్ పెట్టుకొని డ్రైవింగ్ చేసిన వారికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. తాజాగా ఇలా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడిపిన మహిళలకు ట్రాఫిక్ పోలీసులు చీరలు పంపిణీ చేశారు. రామగుండం ట్రాఫిక్ పోలీసుల వెరైటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు రామగుండం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఈరోజు వినూత్న కార్యక్రమానికి ట్రాఫిక్ పోలీసులు శ్రీకారం చుట్టారు. హెల్మెట్ పెట్టుకుని ద్విచక్ర వాహనం నడిపిన మహిళలకు ట్రాఫిక్ పోలీసులు చీరలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో అధికంగా రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. అయితే మనం అజాగ్రత్తగా నడిపినట్లు అయితే మనతోపాటు రోడ్డుపై నడిచేవారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్, సిగ్నల్ క్రాసింగ్ చేసినట్లయితే చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు. అంతేకాకుండా వాహనాలకు సంబంధించి అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు. పలుమార్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం వల్ల అకస్మాత్తుగా ప్రమాదం సంభవించినా.. తలకు ఎలాంటి గాయం కాకుండా.. ప్రాణాలను నిలుపుకోవచ్చన్నవారు. హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోయినట్లు రిపోర్ట్స్ తెలుపుతున్నట్లు తెలియజేశారు.ఆగస్టు 1వ తేదీ నుంచి మధ్య ప్రదేశల్ లోని ఇండోర్ జిల్లాలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని.. హెల్మెట్ పెట్టుకోని వారికి పెట్రోల్ బంద్ చేయాలని ఆ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇలా దేశవ్యాప్తంగా కూడా హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నారు.

## గ్రీన్ చానల్, అంబులెన్స్, కోసం సిగ్నలింగ్

హైదరాబాద్, ఆగస్టు 8, హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని దష్టిలో పెట్టుకుని... అంబులెన్సులు, అత్యవసర సేవలు, ప్రముఖుల వాహనాల కోసం ప్రత్యేక సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది. ఆయా వాహనాలు సిగ్నల్‌కి సమీపింలోకి రాగానే.. ఆటోమేటిక్‌గా గ్రీన్ సిగ్నల్ పడేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులెన్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు.. జనాలు కూడా మాకేంటి.. మేం ముందుగా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలా మంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుండా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు.హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబరు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటుతో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక.. ఇప్పటికే ఉన్న 404 సిగ్నళ్ల నాలుగేళ్ల నిర్వహణకు రూ.70 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటుకు సంబంధించి బుధవారం జీహెచ్ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఆసక్తి ఉన్న సంస్థలు తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులెన్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు.. జనాలు కూడా మాకేంటి.. మేం ముందుగా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలా మంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుండా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు.హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబరు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటుతో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక.

## బీసీ రిజర్వేషన్ పై మాటల యుద్ధం

హైదరాబాద్, ఆగస్టు 8,బీసీ రిజర్వేషన్ల వ్యవహారం తెలంగాణలో పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్–బీజేపీ మధ్య సవాల్ ప్రతిసవాల్‌లు సాగుతున్నాయి. ఢిల్లీ కేంద్రంగా ధర్నా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాషాయ నేతలు మండిపడుతున్నారు. రాహుల్ ప్రధానమంత్రి కాలేదని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పదవి ఊడటం ఖాయమని అంటున్నారు. ఈ క్రమంలోనే కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.తెలంగాణలో బీసీ రిజర్వేషన్ అమలు విషయంలో రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ చేశారు. ముస్లింలకు ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ తీసేసి బిల్లు పంపిస్తే ఆమోదింపజేసేందుకు తాను చొరవ తీసుకుంటానని అన్నారు. ఆ పని చేస్తే తానే రాష్ట్రపతి, ప్రధానమంత్రితో సమావేశమై వారిని ఒప్పిస్తానని అన్నారు. అసదుద్దీన్, అజారుద్దీన్, షబ్బీర్ అలీలు బీసీలు ఎలా అవుతారని వాళ్లను బీసీల్లో చేర్చడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో రేవంత్ సర్కారు పునరాలోచించాలని సూచించారు.ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఇప్పుడు తప్పును బీజేపీ, కేంద్రంపై నెట్టేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నిస్తోందని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. అధికారంలోకి వచ్చిందేకు అమలు కాలని హామీలు ఇచ్చారని ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని అంటున్నారు. వాటిని సరిగా చేయలేకపోయారని ఇప్పుడు బీసీ రిజర్వేషన్ విషయంలో అదే మోసం కంటిన్యూ చేస్తున్నారని అన్నారు. డిక్లరేషన్‌ల పేరుతో ఊదరగొట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ఏ వర్గానికి న్యాయం చేయలేదని ఆరోపించారు. చేసిన మోసాలు అన్నింటికీ రాహుల్ గాంధీ, సోనియా గాంధీయే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో ధర్నా పెట్టి బీసీ రిజర్వేషన్‌పై మాట్లాడుకుండ గాంధీ కుటుంబం గొప్పలు, ప్రతిపక్షాలు, కేంద్రంపై విమర్శలు చేశారని అన్నారు. ఇలాంటి చిత్తశుద్ధి లేకుండా చేసే డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారని అభిప్రాయ పడ్డారు.బీసీ రిజర్వేషన్ అంశంలో కిషన్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. తమ చిత్తశుద్ధిని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేసిన రేవంత్ రెడ్డి తమ కమింట్‌మెంట్ నిరూపించుకున్నామని తెలిపారు. ఢిల్లీ ధర్నాతో గట్టిగానే వాయిస్ వినిపించామన్నారు. ఇప్పుడు బంతి మోదీ కోర్టులో ఉందని వివరించారు. రాష్ట్రపతికి రాజకీయా లతో సంబంధం లేదని చెప్పిన రేవంత్ రెడ్డి.... రాష్ట్రపతి మోదీ చేతుల్లో ఉన్నారా అని బీజేపీ నేతలు చెప్పాలని సెటైర్లు వేశారు.

## రిజర్వేషన్లు లేకుండానే స్థానిక ఎన్నికలు

హైదరాబాద్, ఆగస్టు 8, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని కోర్టు డెడ్ లైన్ పెట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదం పొందలేదు. ఢిల్లీలో ధర్నా చేసిన సీఎం రేవంత్ ప్రధానిగా రాహుల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలకు 42 శాతం కోటా ఇస్తామని ప్రకటించారు. అంటే ఇప్పుడు.. రిజర్వేషన్లకు అవకాశం లేదని ప్రభుత్వం కూడా నిర్ణయానికి వచ్చినట్లే అనుకోవచ్చు. మరి ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలో సీఎం రేవంత్ ఏం చేయబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్రపతి నుండి ఎలాంటి స్పందన లేనందున సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సీఎం రేవంత్ అంటున్నారు. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే.. ఇక్కడి వరకు వచ్చామని.. ప్రస్తుతం ప్రభుత్వం ముందు మూడు ఆప్షన్లు ఉన్నాయని రేవంత్ అంటున్నారు. అందులో ఒకటి కేంద్రం ఆమోదం తెలిపే వరకు వేచి చూడాలి. ఇప్పుడల్లా ఆమోదిస్తారన్న నమ్మకం లేదు. స్థానిక ఎన్నికలు నిర్వహించి తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో ఇక జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లడం. అయితే జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్తే.. అది న్యాయపరమైన వివాదాల్లో ఇరుక్కుంటుంది. దీని వల్ల స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతాయి. మూడో ఆప్షన్ గా 42 శాతం బీసీలుక రిజర్వేషన్ పార్టీ పరంగా ఇచ్చి ఎన్నికలకు వెళ్ళడమని రేవంత్ అన్నారు. ప్రభుత్వం జీవో ఇచ్చి ఎన్నికలకు ఎవరైనా కోర్టుకు పోతే స్టే ఇస్తుంది. రిజర్వేషన్ గురించి అబద్ధపు హామీలు ఇచ్చి నేను ఎన్నికలకి నేను పోలేనన్నారు. సెప్టెంబర్ 30 కల్లా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలి

# తల్లి వివాహేతర బంధం... కొడుకు ఆత్మహత్య

అదిలాబాద్, ఆగస్టు 8,ఓ తల్లి చేసిన పాడు పనికి కన్న కొడుకు మనోవేదనకు గురయ్యాడు. తెలిసిన వారు సూటి పోటి మాటలతో మరింత బాధపెట్టడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన సోదరి తమ్ముడిని కాపాడుకునేందుకు హుటాహుటిన ఆస్పత్రికి తరలించింది.. కానీ ఎలాంటి లాభం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ ఆ యువకుడు తనువు చాలించాడు. చివరి నిమిషంలో తన చావుకు తన తల్లి , తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఆ వ్యక్తే కారణం అంటూ తన ఆవేదనను చెప్పుకున్నాడు. ఈ మేరకు మరణ వాగ్మూలం ఇచ్చి తుదిశ్వాస విడిచాడు. ఆ యువకుడి మృతిని జీర్ణించుకోలేని తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులు అనుమానితుడి ఇంటిపై దాడికి దిగారు. ఇంటికి నిప్పటించి మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ దారుణ ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది.మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గంగారాం గ్రామానికి చెందిన దుర్కి అనిల్ అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్యహత్యకు పాల్పడ్డాడు. తన తల్లి రాజేశ్వరి అదే గ్రామానికి చెందిన మూడపల్లి తిరుపతి అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని.. ఈ విషయం తెలిసిన దగ్గరి బంధువులు ప్రశ్నించడంతో మనోవేదనకు గురైన అనిల్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన సోదరి అనిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అనిల్‌ను వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అనిల్ మృతి చెందాడు.చికిత్స పొందుతున్న చివరి సమయంలో తన ఆత్మహత్య యత్నానికి కారణం తన తల్లి రాజేశ్వరి, తిరుపతి లంటూ మరణ వాగ్మూలం ఇచ్చాడు. అనిల్ మృతికి కారణమైన తిరుపతిని అరెస్ట్ చేయాలంటూ అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు మృతదేహంతో తిరుపతి ఇంటి ముందు ఆందోళనకు దిగారు. అంతటితో ఆగకుండా తిరుపతి ఇంటి పై దాడిచేసి ఇంటికి నిప్పు పెట్టారు. ఈ ఘటనతో అలర్ట్ అయిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. పోలీసులు నచ్చ చెప్పడంతో నాలుగు గంటల ఆందోళన అనంతరం మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు

# ఆ 20 మంది ఎవరు...

హైదరాబాద్ ఆగస్టు 8, తెలంగాణ రాజకీయాల్లో వేడి రాజుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద కాంగ్రెస్ నేత, మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.రేవంత్ రెడ్డి వెనక 20 మంది ఆంధ్ర పెట్టుబడిదారులు ఉన్నారు. వారంతా తెలంగాణ సంపదను దోచుకుంటున్నారు. త్వరలోనే వారి బండారం బహిర్గతం చేస్తాను" అంటూ ఆయన సంచలనంగా ప్రకటించారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్ వర్గాల్లో అంతర్గత కలహాలు మళ్ళీ ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.రేవంత్ రెడ్డి తాను ముఖ్యమంత్రిగా ఉన్నా, తన మాటలు, వైఖరిని మార్చుకోవాలని సూచించారు. "తన భాష మార్చుకోవాలి.. హావభావాలు మార్చుకోవాలి. గంటల తరబడి మాట్లాడటం కాదు, ఆ శ్రద్ధను పరిపాలనపై చూపించాలి," అని ఆయన హితవు పలికారు.రాజగోపాల్ రెడ్డి, "ఇంకో మూడున్నరేళ్లు ఆయనే సీఎం. ఆ తర్వాత ఎవరు అవుతారు అనేది అధిష్ఠానం, ప్రజలు నిర్ణయిస్తారు," అని చెప్పారు. దీనితో కాంగ్రెస్ పార్టీ లోపలే లీడర్షిప్ పై ఒక స్థిరత్వం లేకపోవడం స్పష్టమవుతోంది.ఇటీవలే కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ, నేతల మధ్య విభేదాలు బయటపడటం పట్ల పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి నాయకత్వంపై పార్టీలోని సీనియర్ నేతల అసంతృప్తి ఇప్పటికీ కొనసాగుతుందనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి.ఈ ఆరోపణలపై రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారో, కాంగ్రెస్ అధిష్టానం ఏమేరకు మధ్యవర్తిత్వం చేస్తుందో చూడాల్సి ఉంది. రాజకీయంగా ఇది తెలంగాణలో కొత్త దిశగా చర్చలకు దారి తీసే అవకాశం ఉంది.

# డ్రగ్స్ కు ఎడిక్ట్ అవుతున్న డాక్టర్లు

## ఒకే కాలేజీలో 32 మంది

హైదరాబాద్, ఆగస్టు 8,వైద్యో నారాయణో హరి అన్నారు..! అంటే వైద్యుడు దేవుడితో సమానం. సమాజంలో డాక్టర్‌కు అంతటి హోదానిచ్చాం మనం. కానీ వరుస ఘటనలు వైద్య వృత్తికే మచ్చ తెచ్చేలా ఉన్నాయి. గతకొన్ని రోజులుగా డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతూ వందలాది మందిని అరెస్ట్ చేసిన ఈగల్ టీమ్.. పక్కా సమాచారంతో మెడిసిటీ మెడికల్ కాలేజీపై ఫోకస్ పెట్టింది. ఆ కాలేజీకి డ్రగ్స్ ఎలా వెళ్తున్నాయి..? ఎవరు తీసుకెళ్తున్నారు..? అంటూ నిఘా పెట్టి పలువురిని అరెస్ట్ చేయడంతో పాటు షాకింగ్ విషయాలు వెల్లడించారు అధికారులు. లేటెస్ట్‌గా ఈగల్ టీమ్‌కి దొరికిన డాక్టర్స్ డ్రగ్స్ డైరీ షాక్‌కి గురిచేస్తోంది. అటు పెడ్లర్ల లావాదేవీలు చూసి అధికారులే అవాక్కయ్యారు.జరీనాభాను, అర్ఫాత్ ఖాన్.. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లను పట్టుకున్నారు ఈగల్ టీమ్ అధికారులు. ఆ ఇద్దరి ఫోన్ కాల్స్, యూపీఐ ట్రాన్సాక్షన్‌ను ట్రాక్ చేసి 100 మంది డ్రగ్స్ కన్జ్యూమర్స్‌ను పట్టుకున్నారు. ఆ వందమందిలో 32మంది మెడిసిటీ కాలేజీకి చెందిన మెడికోలు ఉండటం షాక్‌కు గురిచేస్తోంది. ఆ ముప్పై రెండు మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. తొమ్మిది మందికి పాజిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చినవారిలో ఇద్దరు మహిళా డాక్టర్లు ఉన్నట్లు తేల్చారు.ఈగల్ టీమ్‌కి దొరికిన ఇద్దరు పెడ్లర్లు మామూలోళు కాదు..! అర్ఫాత్‌ఖాన్, జరీనాభానును అరెస్ట్ చేసిన అధికారులు విస్తుపోయే వాస్తవాలు వెల్లడించారు. అర్ఫాత్‌ఖాన్ దగ్గర నుంచి 6కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జరీనాభాను అకౌంట్ నుంచి జరిగిన ట్రాన్సాక్షన్స్ చూసి అధికారులే షాక్ అయ్యారు. కోటి యాభై లక్షల రూపాయల లావాదేవీలను గుర్తించారు. అందులో 26 లక్షల రూపాయలు హైదరాబాద్‌కు చెందిన డీలర్స్ నుంచి వచ్చినట్లు తెలిపారు.డ్రగ్స్ సరఫరా, ఆర్థిక లావాదేవీలు అటుంచితే? ముంబై, గోవా నుంచి డ్రగ్స్ తీసుకొొచ్చి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు అధికారులు. ఈ ఇద్దరికి సుమారు 100మంది డ్రగ్స్ డీలర్లతో లింకులున్నట్లు గుర్తించారు. అందులో 51మంది హైదరాబాద్‌లో ఉన్నట్లు తేల్చారు. వాళ్లను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందినవాళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదంటున్నారు.మొత్తంగా? మెడిసిన్ వెళ్లాల్సిన మెడికల్ కాలేజీకి డ్రగ్స్ వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది..! ఒకే కాలేజీకి చెందిన 32 మంది మెడికోలు డ్రగ్స్‌కు బానిసవ్వడం షాక్‌కి గురిచేస్తోంది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దొరికిన ఇద్దరు పెడ్లర్లతో లింక్స్ ఉన్న ఏ ఒక్కరినీ వదిలేదే లేదంటున్నారు.

# నీట మునిగిన నగరం



హైదరాబాద్, ఆగస్టు 8, కుండపోత వర్షానికి హైదరాబాద్ ఆగమైంది. రాత్రంతా పడుతున్న వాన జనాలను టెన్షన్ పెట్టించింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టుగా క్లౌడ్ బరస్ట్ అయినట్టుగా మేగమంతా వచ్చి భాగ్యనగరంపై పడింది. సాయంత్రం ఇళ్లకు బయల్దేరే ఉద్యోగులు, శ్రావణ శుక్రవారం పూజల కోసం సామాగ్రి కొనుక్కునేందుకు బయటకు వచ్చిన వారంతా తడిసి ముద్దై దారులు వెతుక్కొని ఇంటికి చేరారు. రికార్డు స్థాయిలో కురిసిన వాన భయపెట్టిందిఉదయం ఉక్కపోతతో అల్లాడిపోయిన జనం సాయంత్రానికి వాతావరణం చల్లబడటంతో కాస్త ఉపశమనం పొందారు. అయితే వాన ముంచెత్తుతుందని వారు అనుకోలేదు. ప్రశాంతంగా చల్లగాలిలో ఇంటికి బయల్దేరారు. నాలుగు చినుకులు పడేలోపు ఇంటికి చేరుకుందామని కొందరు, అలాషికారుకు వెళ్లిన వాళ్లు మరికొందరు, ఇలా వివిధ కారణాలతో వెళ్లిన వాళ్లంతా టెన్షన్ పడేలా వాన దంచి కొట్టింది. ఈ రాత్రికి ఇంటికి చేరుకోగలమా అనేలా కమ్మేసింది. ఊపిరి తీసుకునే ఛాన్స్ కూడా అన్ని ప్రాంతాలను కుమ్మిపడేసింది.కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోయాయని సాధారణంగా చెప్పుకుంటారు. కానీ ఈసారి అన్ని ప్రాంతాలు నీట మునిగాయి. అపార్ట్‌మెంట్‌లలోకి నీరు వచ్చి చేరింది. ఆఫీసుల్లోకి నీరు వచ్చింది. లిఫ్టుల్లోకి కూడా వరద నీరు చేరింది. ఈ ప్రాంతం ఆ ప్రాంతం అని తేడా లేకుండా ఈ చివరి నుంచి ఆ చివరి వరకు ఎక్కడ చూసిన ముంపు సీన్లు కనిపిస్తున్నాయి.అపార్ట్మెంట్‌లలోకి వరద నీరు చేరడంతో కార్లు, ఇతర వాహనాలు నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లో వాహనాలు కొట్టుకుపోయాయి. వ్యక్తులు కూడా కొట్టుకుపోయారు. బయటకు వెళ్లిన వాళ్లంతా అతి కష్టమ్మీద ఇంటికి చేరుకున్నారు. ఓలా ఉబర్‌లో వాహనాలు కూడా బుక్ కాలేదు. ఇంటికి చేరే దారి నడుచుకుంటూనే వర్షం లో తడుస్తూ చేరుకున్నారు.వర్షం ధారళంగా కురిసింది రెండు గంటలే కానీ దాని ప్రభావం మాత్రం రాత్రంతా ఉంది. ఆ తర్వాత కూడా వాన తెలిపిరి ఇవ్వలేదు. జల్లుల రూపంలో పడుతూనే ఉంది. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు అక్కడి ప్రజలను వేరే ప్రాంతాలకు తరలించారు. వర్షాలు వదిలే వరకు ఎవరూ బయటకు రావద్దని సూచించారు. చాలా ప్రాంతాల్లో డ్రైనేజీలు ఉప్పొంగుతూ కనిపించాయి. ఇది కూడా వరద ఉప్పొంగడటానికి కారణమైంది. హైదరాబాద్‌లో మరోసారి కుండపోత వాన కురిసింది. సరిగ్గా సాయంత్రం వేళ భారీ వర్షం కుమ్మేయడంతో జనజీవనం అస్థవ్యస్తమైంది. తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో రోడ్లపై వరద పోటెత్తింది. పలు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. పలు కాలనీల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దాదాపు హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాలను వర్షం కుమ్మేసింది. హైదరాబాద్‌లో వర్షపాతం విషయానికి వస్తే.. సిటీలో శేరిలింగంపల్లి జోన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఇక్కడ 14.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. శ్రీనగర్ కాలనీ, ఖైరతాబాద్, సరూర్ నగర్ ప్రాంతాల్లో 12 సెంటీమీటర్లకు పైగా వర్షం పడింది. ఉప్పల్, ఎల్బీనగర్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక అమీర్‌పేట్, గచ్చిబౌలి, జూబ్లిహిల్స్, నాగోల్, హయత్‌నగర్ ప్రాంతాల్లో 10 సెంటీమీటర్ల వర్షం కురిసిందని వాతావరణ అధికారులు చెబుతున్నారు.

# సుంకాల సవాల్..

## ఇండియాకు ఇదో అవకాశం..

ముంబై ఆగస్టు 8అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% సుంకాలు భారతీయ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు గానూ ఈ అదనపు 25% సుంకాలను విధించారు. ఈ సంక్షోభ సమయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఈ సవాలును అవకాశంగా మలచుకోవాలని సూచిస్తూ కీలక సంస్కరణలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. 1991లో విదేశీ మారక నిల్వల సంక్షోభం భారత్‌ను ఆర్థిక సంస్కరణల దిశగా నడిపించినట్లే, ఈ సుంకాల మథనం భారత్‌కు 'అమృతం' లభించే అవకాశాన్ని కల్పించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% సుంకాలు, ఇప్పటికే ఉన్న 25% సుంకాలకు అదనంగా 25% 'పెనాల్టీ' సుంకంగా రష్యా నుంచి చమురు కొనుగోలు కారణంగా విధించబడ్డాయి. ఈ సుంకాలు ఆగస్టు 27 నుంచి అమలులోకి రానున్నాయి, ఇవి భారత్ యొక్క 86 బిలియన్ డాలర్ల ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. వస్త్రాలు, ఆక్వా ఉత్పత్తులు, తోలు, ఔషధాలు, ఆటోమొబైల్ రంగాలు వంటి కీలక రంగాలు వెంటనే నష్టపోయే అవకాశం ఉంది. భారత ప్రభుత్వం ఈ సుంకాలను 'అన్యాయం, అసమంజసం' అని విమర్శిస్తూ, దేశ ఆర్థిక భద్రత మరియు ఇంధన అవసరాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోలు అవసరమని సమర్థించింది. అయినప్పటికీ, ఈ సుంకాలు భారత ఆర్థిక వృద్ధిని 0.2?0.3% వరకు తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.ఆనంద్ మహీంద్రా ఈ సుంకాల యుద్ధాన్ని 1991 విదేశీ మారక నిల్వల సంక్షోభంతో పోల్చారు, ఇది భారత్‌లో ఆర్థిక సంస్కరణలకు దారితీసింది. ఈ 'సుంకాల మథనం' నుంచి 'అమృతం' పొందేందుకు రెండు కీలక సూచనలను ఆయన ప్రతిపాదించారు. మొదటిది, వ్యాపార సౌలభ్యతను గణనీయంగా మెరుగుపరచడం. సమర్థవంతమైన సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థను సృష్టించడం ద్వారా పెట్టుబడులకు భారత్‌ను ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చాలని సూచించారు. రాష్ట్రాలు, కేంద్రం సమన్వయంతో ఈ వ్యవస్థను అమలు చేయాలని, వేగం, సరళత, ఊహాజన్యతను నిర్ధారించాలని ఆయన నొక్కి చెప్పారు. రెండోది, పర్యాటక రంగాన్ని విదేశీ మారక నిల్వలు, ఉపాధి సృష్టికి శక్తివంతమైన సాధనంగా మార్చడం. వీసా ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయడం, పర్యాటక కారిడార్‌లను అభివృద్ధి చేయడం, భద్రత, పరిశుభ్రత వంటి అంశాలను మెరుగుపరచడం ద్వారా ఈ రంగాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు.మహీంద్రా సూచనలు కేవలం ఈ రెండు అంశాలకే పరిమితం కాదు. ఆయన మరింత విస్తృతమైన సంస్కరణలను ప్రతిపాదించారు, వీటిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ద్రవ్య సహాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడం, ఉత్పాదన?లింక్డ్ ఇన్సెంటివ్ పథకాల విస్తరణ, తయారీ రంగంలో దిగుమతి సుంకాలను క్రమబద్ధీకరించడం వంటివి ఉన్నాయి. ఈ చర్యలు భారత ఉత్పత్తుల యొక్క పోటీతత్వాన్ని పెంచడంలో సహాయపడతాయని, దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇతర దేశాలు తమ జాతీయ ప్రయోజనాలను ప్రాధాన్యతగా భావిస్తున్నట్లే, భారత్ కూడా స్వావలంబన, ఆర్థిక శక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. యూరోపియన్ దేశాలైన ఫ్రాన్స్, జర్మనీ సుంకాల ఒత్తిడిని ఎదుర్కొంటూ, రక్షణ ఖర్చులను పెంచడం ద్వారా ఆర్థిక విధానాలను సవరించడం ద్వారా ఆర్థిక పునరుజ్జీవనానికి పునాది వేశాయి. అదేవిధంగా, కెనడా తన రాష్ట్రాల మధ్య ఉన్న వాణిజ్య అడ్డంకులను తొలగించడం ద్వారా ఆర్థిక సమైక్యతను సాధిస్తోంది. ఈ 'అనూహ్య పరిణామాలు' దీర్ఘకాలంలో ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని మహీంద్రా అభిప్రాయపడ్డారు. భారత్ కూడా ఈ విధమైన వ్యూహాత్మక సంస్కరణల ద్వారా గ్లోబల్ ఆర్థిక వేదికపై తన స్థానాన్ని బలోపేతం చేసుకోవచ్చని ఆయన సూచించారు.డొనాల్డ్ ట్రంప్ విధించిన 50% సుంకాలు భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనున్నప్పటికీ, ఆనంద్ మహీంద్రా ఈ సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలచుకోవాలని సూచిస్తున్నారు. తయారీ రంగంలో పోటీతత్వాన్ని పెంచే సంస్కరణల ద్వారా భారత్ తన ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేసుకోవచ్చు. మహీంద్రా పిలుపు భారత్‌ను స్వావలంబన, గ్లోబల్ ఆర్థిక వేదికపై నమ్మకమైన శక్తిగా నిలబెట్టే దిశగా ఒక బలమైన మార్గనిర్దేశం.

# అవే ఆరోపణలు... మారని రాహుల్ తీరు

న్యూఢిల్లీ, ఆగస్టు 8, చింత చచ్చినా పులుపు చావదంటే ఇదే రాహుల్ జీ. ఎన్నికల్లో దశాబ్ధాల మీ పార్టీ కుంభకోణాలు చూసి.. విసిగి వేసారి జనాలు మోడీజీకి పట్టం కడితే ఆయన పాలనను మెచ్చి మూడు సార్లు గద్దెనెక్కిస్తే.. అమెరికా తొత్తుల మాయలోపడి.. ఫండింగ్ అనుసారం బీజేపీని ఎలా తొక్కేయాలో బాగానే ప్లాన్లు వేస్తున్నాడు మన ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. బీజేపీని ఎన్నికల్లో ఓడించే దమ్ము, ధైర్యం కాంగ్రెస్ కు ఎలాగూ లేదు. ప్రతిపక్ష పార్టీలకు వచ్చినన్నీ ఓట్లు, సీట్లు కూడా కాంగ్రెస్ కు రాలేదు. దీంతో ఏం చేయాలో పాలుపోక ఇప్పుడు ఇక మహారాష్ట్రలో, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందంటే పాడిందే పాడరా పాసుపండ్ల దాస అన్నట్టుగా వల్లెవేశారు. దానికి సరైన ఆధారాలు చూపించడం లేదని బీజేపీ వాదులు మండిపడుతున్నారు. కొన్ని ఓట్లు చూపిస్తే గోల్ మాల్ అవుతుందా? ఇంత పెద్ద దేశంలో కొన్ని ఓట్లను ఎలా ప్రమాణికంగా తీసుకుంటారని బీజేపీ వాదులు ఎదురు ప్రశ్నిస్తున్నారు.ఢిల్లీ ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు వింటుంటే కామెడీ బాగా చేశారనిపిస్తోంది.. ఎన్నికల అనంతరం ఓట్ల చోరీ, నకిలీ ఓటర్లు, దళారీ వ్యవస్థలు అంటూ ప్రతిసారి ఓటమిని ధ్వంసపరిచేందుకు ఆయన చేసే ప్రయత్నం కొత్తేమీ కాదు. కానీ ప్రజలు మాత్రం ఇదే కథకు ఏడాదికేడాది విసుగుతో కూడిన వ్యతిరేకతను వ్యక్తపరిచారు. రాహుల్ చెప్పింది నిజంగా నిజం అయితే.. తెలంగాణలో , కర్ణాటకలో కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది. ఇక్కడ కూడా బీజేపీ ఓట్ల గోల్ మాల్ చేసి గెలవొచ్చు కదా.. ఈ పాయింట్ ను రాహుల్ ఎందుకు ప్రస్తావించడం లేదన్నది బీజేపీ వాదుల ప్రశ్న.ఓటమికి అసలు కారణం తమ పక్షంలో లేదని రుజువు చేయాలనేలా రాహుల్ ఆరోపణలు చేస్తూ మళ్లీ బీజేపీపై తప్పుడు విమర్శలు గుప్పిస్తున్నారు. "ఆటంబాంబు లాంటి ఆధారాలు" తమ వద్ద ఉన్నాయట! ఆ బాంబ్ ఎప్పుడు పేలుతుందో తెలీదు కానీ, కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా రోజుకో మాయబాంబ్ పేలుస్తూ ప్రజల మనస్సుల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుంది. అయితే ఇప్పటి ప్రజలు మాత్రం అవే పాత స్టోరీలు వినేంత అమాయకులు కాకపోవడం గమనార్హం.మధ్యప్రదేశ్, మహారాష్ట్ర,



లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించినా తన వద్ద ఉన్నటువంటి ఆధారాలను ఎప్పటికీ ప్రజల ముందు ఉంచలేరు. ఎన్నికల సంఘాన్ని హెచ్చరించడమో, అధికారులను బెదిరించడమో కాంగ్రెస్‌కు పరిష్కార మార్గంగా మారిపోయింది. కానీ ప్రజలు మాత్రం ఈ ఆరోపణలపై ఏ మాత్రం విశ్వాసం పెట్టడంలేదు.ఇదే మోడీజీని మూడుసార్లు ప్రధానిగా గద్దెనెక్కించిన దేశ ప్రజల తీర్పు. కాంగ్రెస్, రాహుల్ గాంధీకి ఓట్లు వేయకుండా మోడీ పాలనపై ప్రజల విశ్వాసాన్ని మరోసారి ధృవీకరించారు. నిజాయితీ, దేశభక్తి, అభివృద్ధి అజెండాతో ముందుకు సాగుతున్న నాయకుడు నరేంద్ర మోడీకి తిరుగులేదని సమీక్షలో స్పష్టమైంది.ఓటమి వచ్చినప్పుడల్లా ఎన్నికల వ్యవస్థను నిందించడం, ఈసీపై శంకలు వేయడం ఒక రాజకీయ పాత అలవాటు అయ్యిందని ప్రజలు గుర్తించారు.

# ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈ

గద్వాల,ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో రోజుకొకరు ఏసీబీ వలలో పడుతున్నారు. మొన్న ఒక ఆర్ఐ. నిన్న ఇరిగేషన్ ఏఈ ఇవాళ ఇరిగేషన్ డిఈ. ఇంత దాడులు జరుగుతున్న నేను కాదులే అనుకుని లంచాలు తీసుకోవడానికి అలవాటు పడి ఏసీబీ ట్రాప్ లో పడిపోతున్నారు. జోగులాంబగద్వాలజిల్లా అలంపూర్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కు చెందిన డి ఈ శ్రీకాంత్ 11 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు...యం బి బుక్ మెజర్మెంట్ చేయడానికి ఓ కాంట్రాక్టర్ నుండి 11వేలు రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు శ్రీకాంత్ నాయుడు చిక్కాడు..

# అక్కతమ్ముళ్ళ, అన్నచెల్లెల అనుబంధానికి ప్రతిక ఈ రక్ష బంధన్

**– నేడు రాఖీ పౌర్ణమి**

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

రాఖీ, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంద్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. కొంతకాలం క్రితం వరకూ ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను చాలా వైభవవంగా జరుపుకునేవారు. ఇప్పుడు దేశమంతా జరుపుతున్నారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముల్లు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ.ఈ రోజు బ్రాహ్మణులు నూతన యజ్ఞోపవీతధారణలు చేసి విద్యార్థులకు వేదపఠనం ప్రారంభిస్తారు. వేదపండితులు వేదాలను వల్లెవేయడం అంటే; ఆ వృత్తి చెయ్యడం ఈ రోజునుండే ప్రారంభిస్తారు. ఆ విధంగా వీరు ఈరోజు వేదాలన్నింటిని ప్రారంభ ఋక్కును, చివరి ఋక్కును పఠిస్తారు. కాలక్రమంలో ఈ రోజు "రక్షాబంధన్ లేక రాఖీ" పండుగగా ప్రాచుర్యం పొందసాగింది. ఈ రక్షాబంధనము ఈ దిగువ మంత్రాన్ని పఠిస్తూ భార్య – భర్తకు, సోదరి – సోదరునకు యుద్ధానికి వెళ్ళే వీరునకు విజయప్రాప్తి కోసం ఈ రక్షాబంధనన కడుతూఉంటారు. యేన బద్ధో బలీరాజా దానవేంద్రో మహాబలః। తేన త్వామభి బధ్నామి రక్షమాచల మాచల॥ శ్రీ మహావిష్ణువు శక్తిచే మహాబలుడు అయిన బలిచక్రవర్తిని బంధించినట్లుగా ఓ రక్షాబంధనమా! నీవు చలించక వీనికి రక్షణ కల్పించుము అని మంత్రార్థం. ఈ – రక్షాబంధన్ ఎలా ప్రారంభమైనది అంటే! ఈ గాథ మనకు మంచి ప్రామాణిక మవుతుంది. పూర్వం దేవతలకు – రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధము సాగింది. ఆ యుద్ధములో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై తన పరివారమంతటిని కూడగట్టుకుని 'అమరావతి' లో తలదాచుకుంటాడు. అట్టి భర్తనిస్సహాయతను గమనించిన ఇంద్రాణి 'శచీదేవి' తగు తరుణోపాయమునకై ఆలోచిస్తూ ఉన్న సమయాన ఆ రాక్షసరాజు చివరకు 'అమరావతి'ని కూడా దిగ్బంధన చేయబోతున్నాడు అని గ్రహించి, భర్త దేవేంద్రునకు 'సమరోత్సాహము' పురికొలిపినది. సరిగా ఆరోజు "శ్రావణ పూర్ణిమ" అగుటచేత 'పార్వతీ పరమేశ్వరులను', లక్ష్మీ నారాయణులను పూజించి ఆ పూజించబడిన "రక్షా" దేవేంద్రుని చేతికి కడుతుంది. అది గమనించిన దేవతలందరు వారు పూజించిన రక్షలు తెచ్చి ఇంద్రునకు కట్టి ఇంద్రుని విజయాత్రకు అండగా నిలచి, తిరిగి 'త్రిలోకాధిపత్యాన్ని' పొందారు. ఆనాడు శచీదేవి ప్రారంభించిన 'ఆ రక్షాబంధనోత్సవం' నేడు అది 'రాఖీ' పండుగ ఆచారమైనది.ప్రాచీన గాథ " యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః తేన త్వా మభిబధ్నామి రక్షే మా చల మా చల" భావం– ఓ రక్షాబంధమా! మహాబలవంతుడూ,రాక్షసరాజు అయిన బలిచక్రవర్తిని బంధించినావు. కాబట్టే నేను నిన్ను ధరస్తున్నాను. శ్రీ మహావిష్ణువు బలిచక్రవర్తికోరిక మేరకు అతనితోపాటు పాతాళంలో ఉండిపోతాడు. శ్రీమహాలక్ష్మి వెళ్లి బలిచక్రవర్తికి రక్షాబంధంకట్టి, తన భర్తను వైకుంఠానికి తీసుకొనిపోతుంది. అందుకే రక్షాబంధానికి ఇంత ప్రాధాన్యి ఏర్పడింది.ఈ రాఖీకి ఉన్న పవిత్రత ఏమిటంటే భార్య – భర్తకు, సోదరి – సోదరులకు కట్టే రఖీద్వారా వారి వారు తలపెట్టే కార్యములు విజయవంతమై సుఖసంపదలు కలగాలని, వారి మాన మర్యాదలకు వారు బాసటగా ఉండాలని ఆకాంక్షించే సత్ సంప్రదాయమే ఈ 'రాఖీ' విశిష్టత. అలా రాఖీలు కట్టించుకున్న భర్తలు, సోదరులు వార్కి నూతన వస్త్రాలు చిరుకానుకలు సమర్పించి, అందరు కలసి చక్కని విందు సేవిస్తారు. విదేశీయులు మనదేశాన్ని పాలిస్తున్న రోజులలో మొగాలాయీల దుర్నీతికి దురంతాలకు ఏమాత్రం అడ్డూ అపూ అనేది లేకుండా పోయేది. హిందూ జాతి వారి కబంధహస్తాలలో నలిగిపోయేది. స్త్రీలు వారి మాన ప్రాణరక్షణకై వీరులైన యోధులను గుర్తించి వార్కి 'రక్షాబంధనం' కట్టి వారు చూసే సోదర భావముతో, రక్షణ పొందేవారు.

## ఆ ఐదుగురిపైనే భారమంతా

విజయవాడ, ఆగస్టు 8, వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న క్రమంలో.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధపడుతున్నారు. ప్రజల మధ్యకు వెళ్లేందుకు అన్ని రకాల సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పార్టీలో మిగతా నాయకులను క్రియాశీలకం చేస్తున్నారు. అందులో భాగంగా యువతకు ప్రాధాన్యం ఇస్తూ కార్యవర్గాలను నియమిస్తున్నారు. కూటమి దూకుడుగా ఉన్న నేపథ్యంలో యువ నేతలకు అవకాశం ఇవ్వడం ద్వారా.. ధీటుగా ఎదుర్కొంటారని ఆలోచన చేస్తున్నారు. అందుకే యువజన విభాగాన్ని మరింత పటిష్టం చేశారు జగన్. యువజన విభాగానికి కొత్తగా ఐదుగురు యువనేతలను వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఈ మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కొత్తగా వర్కింగ్ ప్రెసిడెంట్లు..

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్లు గా అన్నం రెడ్డి అదీప్ రాజు, కారుమూరి సునీల్ కుమార్, పేర్ని కిట్టు, భూమన అభినయ్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నియామకం అయ్యారు. వారికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాలకు బాధ్యులుగా నిర్మించారు. ఆ జిల్లాల్లో పార్టీ బాధ్యతలను అధ్యక్షుడితో కలిసి పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జక్కంపూడి రాజా కొనసాగుతున్నారు. ఈయన మాజీ ఎమ్మెల్యే కూడా.

అన్నం రెడ్డి అదీప్ రాజుకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి బాధ్యతలు అప్పగించారు.

కారుమూరి సునీల్ కుమార్ కు కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల బాధ్యతలు అప్పగించారు.

పేర్ని కిట్టుకు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల బాధ్యతలు ఇచ్చారు.

భూమన అభినయ రెడ్డికి ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల బాధ్యతలు ఇచ్చారు.

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి వైయస్సార్ కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల బాధ్యతలను కేటాయించారు

## డ్రోన్స్ సాయంతో ట్రాఫిక్ కంట్రోల్

విజయవాడ, ఆగస్టు8, విజయవాడ ట్రాఫిక్ పోలీస్ శాఖ టెక్నాలజీని వినియోగించడంలో మరో దశలోకి ప్రవేశించింది. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా నగర ట్రాఫిక్ విభాగానికి ఆధునిక పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన 14 డ్రోన్లు, 350 బ్యాటన్ లైట్లు, 720 పోలీస్ క్యాప్స్ అధికారికంగా అందజేశారు. తర్వాత 40 కొత్త ట్రాఫిక్ పాట్రోల్ వాహనాలకు పచ్చజెండా ఊపి సేవలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీజీపీ గుప్తా మాట్లాడుతూ, విజయవాడ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, హెల్మెట్ డ్రైవ్స్, శాంతి భద్రతల పరిరక్షణలో అత్యుత్తమంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ట్రాఫిక్ సిబ్బంది ఎండ, వర్షం, కాలుష్యానికి లోనై సమర్పణతో పనిచేస్తున్న తత్వాన్ని గుర్తించి, వారి సేవలను ప్రశంసించాల్సిందే అన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో టెక్నాలజీ ప్రాముఖ్యత.. విజయవాడ పోలీసులు ఆధునిక సాంకేతికతను సమర్ధవంతంగా వినియోగిస్తూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, నేర నిరోధంలో, ట్రాఫిక్ నియంత్రణలో టెక్నాలజీ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఆయన డ్రోన్ల పనితీరును స్వయంగా తనిఖీ చేశారు. విజయవాడ నగరం ఇప్పటికే "అస్త్రావ్" అనే ఏఆర్ ఆధారిత వ్యవస్థను విజయవంతంగా ప్రయోగించిందని, విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దాన్ని వినియోగించారని వివరించారు. ఈ విజయవంతమైన మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు. విజయవాడ తరహా ఇతర నగరాల్లోనూ త్వరలో.. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కనీసం ఒక డ్రోన్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వీటిని నిఘా, రక్షణకోసం వినియోగిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు తెలిపారు. సీసీటీవీలు, డ్రోన్లు, ఇతర ఆధునిక పరికరాలను విరాళంగా అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. టెక్నాలజీ ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలు, నేరగాళ్లను వేగంగా గుర్తించగలుగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖకు సంబంధించిన దృక్పథం మారిందని, ప్రజల భద్రతకు టెక్నాలజీ సహకారంతో మరింత సమర్ధవంతంగా స్పందించగలుగుతున్నామని అధికారులు పేర్కొన్నారు. విజయవాడ తరహా మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ త్వరలో అమలు చేయనున్నట్టు తెలుస్తోంది.

## పులివెందులలో వైఎస్ వివేకానంద రెడ్డి జయంతి వేడుకలు

కడప ,పులివెందులలో మాజీమంత్రి వైయస్ వివేకానంద రెడ్డి75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమాధుల తోపు వద్ద వైఎస్ వివేకానంద రెడ్డి సమాధికి కూతురు సునీత రెడ్డి, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, భార్య సౌభాగ్యం కుటుంబ సభ్యులు, బావమరిది శివ ప్రకాష్ రెడ్డి నివాళు లర్పించారు. తరువాత అనంతరం వైఎస్ వివేకానంద రెడ్డి పార్కు వద్ద ఏర్పాటుచేసిన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. సునీత మాట్లాడుతూ సమాధి దగ్గర ఉండగా ఏవి ఏవో కలలు వస్తున్నాయని, పులివెందుల ఉన్నవాళ్లకు తెలుస్తుందని, మేము అక్కడే నివాసం ఉ ండేవాళ్ళమన్నారు. అవినాష్ మాకంటే 10సంవత్సరాలు చిన్నవాడని,మేము వాళ్ళతో ఆడు కునే వాళ్ళమన్నారు. పిల్లలు ఉన్న లేకున్నా మేము కలిసి అడుకునేవాళ్ళమన్నారు. నాన్న చనిపోయిన తరవాత అవినాష్ తీసుకొని వచ్చినప్పుడు లెటర్స చూసి షాక్ అయ్యానని, అవినాష్ తెచ్చిన లెటర్ లో బి టెక్ రవి,ఆదినారాయణ రెడ్డి పేర్లు ఉన్నాయన్నారు. నాన్న కేసు విషయంలో ఉన్న సిట్ అధికారులను మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత అందరిని మార్చడం జరిగినది నిజం కాదా. నేను కోర్టుకెళ్లగా కోర్ట్ లో న్యాయ అధికారైన జడ్జి ఆలోచించి సిబిఐ కి అప్ప చెప్పింది మీ వల్లే. విచారణకు వచ్చిన సిబిఐ అధికారులను గెస్ట్ హౌస్ లో లేకుండా వెళ్లగొట్టింది మీరు కాదా. సిబిఐ అధికారుల ఆర్ అండ్ పి గెస్ట్ హౌస్ లో వారి వారి వస్తువులను గెస్ట్ హౌస్ నుండి బయట ఇచ్చింది మీరు కాదా. మళ్ళీ కర్నూల్ లో హాస్పిటల్ లో పోలీస్ అడ్డు పెట్టుకొని సిబిఐ వాళ్ళు అరెస్ట్ చేయానియకుండా అడ్డుకున్నారని అన్నారు. అధికార దర్పంతో పోలీసులను అడ్డుపెట్టుకొని కేసును నీరుగారించిన వ్యక్తుల మీరు నేడు పోలీసులను అనడం దారుణం. పోలీస్ అధికారులు వారి విధిని వారి పైఅధికారులు తెలియజేసిన విధంగా నిర్వర్తిస్తున్నారు. వైస్సార్సీపీ వాళ్లకు గాయాలు అయ్యాయి అని ర్యాలీ చేసారు పోలీస్ పైన మరి నాన్న చనిపోయినప్పుడు ఎందుకు ర్యాలీ చేయలేదు.

## ఫ్యాన్ గూటికి వర్మ నిజమెంత

కాకినాడ, ఆగస్టు 8, కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం అనగానే వెంటనే గుర్తుకు వచ్చేది ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఆ తరువాత అక్కడ టీడీపీ తరపున నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్న వర్మ. తన సీటు పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేయడమే కాదు.. దగ్గరుండి పవన్ కల్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు వర్మ చేసిన కృషిని ఎవ్వరూ కదనలేరు. ఎందుకంటే పిఠాపురం నియోజకవర్గం వర్మతో అంతలా అనుబంధం కలిగి ఉ ంటుంది. పిఠాపురానికి రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన వర్మ ఒకసారి స్వంతంత్ర్య అభ్యర్థిగా మరోసారి టీడీపీ అభ్యర్ధిగా పోటీచేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. అలాంటి వర్మపై పిఠాపురం నియోజకవర్గంలోనే కాదు కాకినాడ జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో ఓ ప్రచారం జరుగుతోంది. ఆయన వైసీపీలోకి వెళ్తున్నారనే ప్రచారం జోరందుకుంది. కూటమిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదనే అసంతృప్తితో వర్మ ఉ న్నారని అందుకే పక్కచూపులు చూస్తున్నారని ఆ ప్రచారం సారాంశం. వర్మ టీడీపీకి వీరాభిమాని. చంద్రబాబు, లోకేష్ అంటే ఎంతో ఇష్టం. అలాంటి వర్మ పార్టీ మారడం అనేది ఫేక్ ప్రచారంగా చాలా మంది కొట్టిపారేస్తున్నారు. అయితే పవన్ కల్యాణ్‌ను గెలిపించడంలో వర్మ పాత్ర లేదని ఎవరూ కాదనలేని నిజం. ఆ తర్వాత కూటమి ఆయనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విమర్శ ఉంది. ఆయనకు ఇస్తామన్న ఎమ్మెల్సీ పదవి ఇంతవరకు చర్చకు రాలేదు. జనసేన నాయకులు ఆయనపై విమర్శలు చేయడం వంటి పరిణామాలు జరుగుతున్న ప్రచారం నిజమని నమ్మేవాళ్లు లేకపోలేదు. మాజీ ఎమ్మెల్యే, పిఠాపురం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వర్మ వైసీపీలో చేరుతున్నారన్న ఆరోపణలు గందరగోళానికి తెరలేపాయి. నిజంగానే వర్మ టీడీపీను వదిలి వైసీపీలో చేరుతున్నారా.. అనే చర్చ కూడా పిఠాపురం నియోజకవర్గంలోనే కాదు మొత్తం కాకినాడ జిల్లాలో సాగుతోంది. మొన్నటి ఎన్నికల్లో వర్మను కూటమి ప్రభుత్వం ఉపయోగించుకుని కరివేపాకులా తీసేస్తుందని, ఇస్తానన్న ఎమ్మెల్సీ పదవిని కూడా ఇవ్వలేదని, జనసేన ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు వ్యాఖ్యలు ఇలా వర్మను పూర్తిగా అసంతృప్తిలోకి నెట్టాయని అంటున్నారు. ఈ కారణంతోనే ఆయన టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరుతున్నారని సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. వర్మపై కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పిఠాపురం టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కావాలని ఆయన్ని రాజకీయంగా దెబ్బ తీసేందుకు ఇలాంటి ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని అంటున్నారు. విమర్శలతో ఆగకుండా పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో భారీగా తరలివచ్చిన వర్మ అభిమానులు, అనుచరులు సోషల్ మీడియా, యూట్యూబ్‌లో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వర్మ టిడిపికి రాజీనామా చేస్తున్నారని, వైసీపీలోకి చేరుతున్నారని వంటి కల్పిత వార్తలను ప్రచారం చేసి, ఆయన రాజకీయ భవిష్యత్తును దెబ్బతీసేలా తప్పుడు వార్తలను ఇటీవల ప్రచారం చేశారు. పిఠాపురం టిడిపి నాయకులు ఈ తప్పుడు వార్తలను తీవ్రంగా ఖండించారు. సోషల్ మీడియాలో ఆధారం లేని వార్తలను ప్రచారం చేసి, వర్మ వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారిపై పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## షర్మిళకు చెక్

### ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్స్



విజయవాడ, ఆగస్టు 8, ఏపీ పై కాంగ్రెస్ హై కమాండ్ దృష్టి పెట్టిందా? రాష్ట్రంలో పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నం జరుగుతోందా? షర్మిలను ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ తీయాలని భావిస్తున్నారా? వైసీపీని బలహీనపరిచి ఆ స్థానంలోకి రావాలని కాంగ్రెస్ చూస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉ న్నాయి. ఇకనుంచి సీనియర్ల సేవలను వినియోగించుకుని పార్టీని బలోపేతం చేయాలని వైసిపి హై కమాండ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పార్టీకి ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లు రావడంతో పాటు ఓ పాతికమంది సీనియర్లతో జంబో కమిటీని ఏర్పాటు చేశారు. షర్మిల సేవలను విస్తృతంగా వాడుకోవడం ద్వారా.. ఆమెను ఈ నాలుగేళ్ల పాటు ప్రజల్లో ఉ ంచడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలన్న ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. తద్వారా ఏపీలో కాంగ్రెస్ బలం పెంచాలని భావిస్తోంది. ఎన్నికలకు ముందు పిసిసి చీఫ్ గా బాధ్యతలు స్వీకరించారు షర్మిల. ఆమె సీనియర్లను కలుపుకొని వెళ్లడం లేదన్న విమర్శ ఉంది. అదే సమయంలో సీనియర్లు సైతం ఆమెకు సహకారం అందించడం లేదన్న ఆరోపణ కూడా ఉంది. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఏపీ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చింది. పిసిసి చీఫ్ గా షర్మిలను కొనసాగిస్తూనే.. వర్కింగ్ ప్రెసిడెంట్గా కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీలను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఓ 25 మందితో కూడిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీని కూడా నియమించింది కాంగ్రెస్. వారిని కలుపుకొని ముందుకెళ్లాలని పిసిసి చీఫ్ నకు ఆదేశించింది హై కమాండ్. కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలో ఓ 25 మందికి చోటు దక్కింది. ఈ కమిటీకి చైర్మన్గా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మాణికం ఠాగూర్ ఉ ంటారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల, పిసిసి మాజీ చీఫ్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, చింతా మోహన్, జెడి శీలం, కిల్లి కృపారాణి వంటి వారికి చోటు కల్పించారు. వీరితో పాటు కేవీపీ రామచంద్రరావు, జిబి హర్ష కుమార్, తులసి రెడ్డి వంటి సీనియర్లు కూడా ఈ కమిటీలో ఉ ంటారు. షర్మిలను ముందు పెట్టి పార్టీని నడిపించే బాధ్యత వీరికి అప్పగించనున్నారు. ఇకనుంచి కాంగ్రెస్ పార్టీలో విధానపరమైన నిర్ణయాలు ఈ కమిటీ తీసుకొనుంది. షర్మిల నాయకత్వ బాధ్యతలు మారుస్తారని అంతా ప్రచారం నడిచింది. అయితే అందులో ఎంత మాత్రం నిజం లేదని తేలిపోయింది. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. అయితే ఆ పార్టీ నుంచి చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. అవకాశం లేని చాలామంది నేతలు అదే పార్టీలో కొనసాగుతున్నారు. వారంతా సైలెంట్ గా ఉన్నారు. అందుకే షర్మిల కు సహకారం అందించి పార్టీని బలోపేతం చేస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.. ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూస్తారన్నది ఒక అంచనా. అందుకే ఉత్తరాంధ్రకు చెందిన ఓ మాజీ మంత్రి, రాయలసీమ ప్రాంతానికి చెందిన ఓ బలమైన వ్యక్తిని పార్టీలోకి రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. అయితే రాష్ట్రవ్యాప్తంగా వైసీపీలో ఉన్న బలమైన నేతలు కొంతమందిని కాంగ్రెస్ లోకి రప్పించగలిగితే మాత్రం.. ఆ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయం. కానీ ఆ ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## అన్నీ ఆయనే... అంతా ఆయనే...

విజయవాడ, ఆగస్టు 8, లోకేశ్.. చంద్రబాబు వారసుడిగా పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన తనను తానూ లీడర్‌గా ప్రూవ్ చేసుకునే విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదు. ఏపీకి నిధులు రాబట్టే విషయంలోనైనా..అపోజిషన్‌కు కౌంటర్ ఇవ్వడంలోనైనా..చివరికి ఏపీ, తెలంగాణ మధ్య ఉన్న వాటర్ ఇష్యూస్‌పై కూడా తన వెర్షన్ ఏంటో వినిపించి..ఆయన సెంట్రిక్‌గా చర్చ జరిగేలా చేశారు లోకేశ్.మామూలుగా అయితే పారిశ్రామిక వేత్తలతో భేటీ అయినా..సింగపూర్ పర్యటనకు వెళ్లి పెట్టుబడులు తెచ్చినా సీఎం చంద్రబాబు మీడియా ముందుకు వచ్చి..ఎన్ని పెట్టుబడులు తెచ్చామో..ఎక్కడెక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయబోతున్నారో క్లియర్ కట్‌గా చెప్పేశారు. కానీ ఈసారి చంద్రబాబుకు బదులు లోకేశ్ ప్రెస్‌మీట్ పెట్టి..ఏపీ టు తెలంగాణ..టీడీపీ టు వైసీపీ వయా జనసేన..ఇలా అన్ని అంశాలపై కన్‌ఫ్యూజన్ లేకుండా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.సింగపూర్ పర్యటనతో ఏపీకి రూ.45 వేల కోట్ల పెట్టుబడులు రానున్నట్లు చెప్పిన లోకేశ్..జగన్ హయాంలో మధ్య బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. విశాఖను ఐటీ హబ్‌గా డెవలప్ చేయాలనేది తమ ప్లాన్ అని చెప్పుకొచ్చిన ఆయన..ఈ క్రమంలో బనకచర్ల ప్రాజెక్ట్, జగన్ అరెస్ట్ ఇలా అన్ని అంశాలను టచ్ చేస్తూ..లోకేశ్ మాట్లాడిన తీరు ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది. ఏ విషయంలోనూ హైరాన పడకుండా చాలా జాగ్రత్తగా మీడియాను అడ్రస్ చేశారు యువనేత.పైగా ప్రభుత్వం తరఫున అఫీషియల్ వాయిస్‌గా ఇన్ అండ్ అన్ని టాపిక్స్‌పై ఆన్సర్ చేశారు. సెన్సిటీవ్ ఇష్యూగా ఉన్న బనకచర్లపై ఏపీ సర్కార్ స్టాండ్‌ను చెప్పేశారు లోకేశ్. రాజకీయ ప్రయోజనాల కోసమే బనకచర్లపై రాద్ధాంతం చేస్తున్నారన్న ఆయన.. సముద్రంలోకి వెళ్లే మిగులు జలాలను ఉపయోగించుకుంటే తప్పేంటి? అంటూ ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు తీసుకునే తెలంగాణ ప్రభుత్వం నిర్మించిందా అంటూ కీలక వ్యాఖ్యలు చేసి..బీఆర్ఎస్ లీడర్లు ప్రెస్‌మీట్ పెట్టేలా చేశారు. జగన్ అరెస్ట్ ఉంటుందా అంటూ మీడియా ప్రశ్నిస్తే కూడా అరెస్ట్ ఉంటుందని కానీ..అరెస్ట్ చేయమని కాని చెప్పుకుండా చట్టం తన పని తాను చేసుకుంటూపోతుందని చెప్పుకొచ్చారు.టీడీపీలోకి అయినా..ఆ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చినా ఫ్యూచర్ లీడర్ లోకేశే. ఈ విషయంలో అందరికీ క్లారిటీ ఉంది. అందుకే ఇప్పటికే సొంత పార్టీ నేతలు ఆయన డిప్యూటీ సీఎం అని, సీఎం అని ఎలివేషన్ ఇస్తున్నారు. బీజేపీ పెద్దలు కూడా ప్రయారిటీ ఇస్తున్నారు. అయినా లోకేశ్ అవసరం లేని హడావుడి చేయట్లేదు. అలా అని మంత్రులు, వారి అనుచరుల తీరుతో ప్రభుత్వానికి బ్యాడ్ నేమ్ వచ్చేలా బిహేవ్ చేస్తే లైట్ తీసుకోవడం లేదు. ఇటు ప్రభుత్వంలో..అటు పార్టీ పరంగా తన అవసరం ఉన్న దగ్గర అన్నీ తానై మాట్లాడుతున్నారు. నిధుల కోసం కేంద్ర పెద్దలను కలిసి విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు.మంగళగిరి ఎమ్మెల్యే. ప్రభుత్వంలో కీలక శాఖకు మంత్రి. అక్కడి వరకే పరిమితం కావడం లేదు మినిస్టర్ నారా లోకేశ్. అలా అని మిగతా మంత్రుల శాఖల్లో వేలు పెట్టడం లేదు. డామినేషన్ చూపించట్లేదు. హడావుడి, హంగామా అసలే లేదు. ఆ మధ్య ఢిల్లీ వెళ్లి వరుస పెట్టి కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిధులు, పెట్టుబడుల కోసం ఏపీ ప్రభుత్వం తరఫున ప్రయత్నాలు చేస్తున్నారు లోకేశ్. బీజేపీ పెద్దలు, కేంద్ర మంత్రులు కూడా చంద్రబాబు వారసుడిగా, ఏపీ మంత్రిగా లోకేశ్ మంచి ప్రయారిటీ ఇస్తుండటం ఆసక్తికరంగా మారింది.ప్రధాని మోదీ విశాఖ పర్యటనలోనూ లోకేశ్‌తో సెపరేటుగా మాట్లాడారు. ఢిల్లీకి వచ్చి తనను కలవాలంటూ అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చారు. తాజా ప్రెస్‌మీట్‌తో మరోసారి లోకేశ్ తన మార్క్ చూపించారు. ఏపీ ప్రభుత్వం తరఫున కీలక అంశాలపై చంద్రబాబు తప్ప ఎవరు మాట్లాడినా..ప్రభుత్వం స్టాండ్ ఏంటో అంత క్లారిటీ ఉండకపోవచ్చు. బట్ లోకేశ్ కామెంట్స్‌తో కాళేశ్వరం టు బనకచర్లతో..వైసీపీకి సంబంధించిన అంశాలపై కూడా క్లారిటీ ఇచ్చేశారు.

## శ్రీకాళహస్తి లో సామూహిక వరలక్ష్మీ వ్రతం

చిత్తూరు, శ్రావణమాసంలో పౌర్ణమి ముందుగా వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మి అమ్మవారిని పూజించడం ఆనవాయితీ. దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని దేవస్థానం ప్రాంగణంలోని బ్రహ్మగుడి వద్ద ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి శ్రీ వరలక్ష్మి అమ్మవారిని ప్రతిష్టించారు . వరలక్ష్మి కథ ఆచరించి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అనంతరం నోములు నోచుకున్న మహిళలు మహిళలకు పసుపు కుంకుమ గాజులు ఇచ్చి వారి వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు అనంతరం అమ్మవారికి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయం కార్యనిర్వహణాధికారి పి బాపిరెడ్డి దంపతులు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి దంపతులు, మరియు దేవస్థానం వేద పండితులు,అర్చకులు, ఆలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో వరలక్ష్మీ నోములు నోచుకున్న మహిళా భక్తులు పాల్గొన్నారు.

## వైజాగ్ లో పేకాట క్వీన్స్

విశాఖపట్టణం, ఆగస్టు 8, కాలం మారిపోయింది. ఎన్నో రకాల రుగ్మతలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా మానవ తప్పిదాలు పెరుగుతున్నాయి. జూదమాటలతో పాటు వ్యసనాల బారిన ఎక్కువ మంది పడుతున్నారు. అయితే ఇప్పుడు మహిళలు కూడా వ్యసనాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. విశాఖపట్నంలోజూదం ఆడుతూ ఆరుగురు మహిళలు పోలీసులకు పట్టుబడటం విశేషం. ఇప్పటివరకు పురుషులే జూద మాటలు ఆడడం చూస్తుంటాం. కానీ ఇప్పుడు మహిళలు సైతం అనుసరించడం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఓ భర్త, ఇంట్లో భార్య రోజూ బయటకు వెళ్లి రావడాన్ని గమనిస్తూ, పేకాట ఆడుతోందని అనుమానంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మొదట్లో స్థానిక పోలీసు స్టేషన్లో అతని ఫిర్యాదును పట్టించుకోకపోయినా, పైఅధికారి స్థాయిలో చెప్పడంతో వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. చివరకు పోలీసుల దాడిలో అసలు గుట్టు వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన వారు ఎవరూ ఊహించని విధంగా మహిళలు కావటం, అంతా ఒకే ప్రాంతంలో కూర్చుని పేకాట ఆడుతుండటం స్థానికులను ఆశ్చర్యకితులను చేసింది. గుట్టు చప్పుడు కాకుండా? గుట్టు రట్టు విశాఖలోని ఒక నివాస భవనం పేకాట 'అడ్డా'గా మారింది. నిత్యం పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలు లలిత నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో రొటీన్‌గా జూదంలో మునిగిపోయారు. అయితే మామూలుగా ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరిస్తూ వస్తుండగా, భర్త తన భార్యపై పెట్టిన అనుమానం పోలీసులకు ఫిర్యాదుగా మారింది. టాస్క్ ఫోర్స్ రంగంలోకి.. ఆరుగురు మహిళలు అదుపులోకి భర్త ఫిర్యాదు తర్వాత నగరంలోని టాస్క్ ఫోర్స్ పోలీసులు సీక్రెట్‌గా సమాచారం సేకరించి, లలిత నగర్‌లో ఆ ఇంటిపై దాడి చేశారు. సరిగ్గా అందరూ ఆటలో ఉండగా.. పోలీసులు అక్కడికి చేరుకొని ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.22,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు, దర్యాప్తు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇప్పటివరకు ఆ మహిళల వివరాలు సేకరించి, స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అంతే కాకుండా, ఈ గృహం ఎవరిది? ఇలాంటివే ఇంకెన్ని ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పట్టుబడిన మహిళలు సంతానంతో ఉన్న గృహిణులు కావటం, ఆర్థిక అవసరాలు లేదా మోజు కారణంగా ఇలా జరిగిందా అన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంటి తలుపులు మూసుకుని.. పేకాటలో మునిగిన రాణులు ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఆ ప్రాంత ప్రజలలో ఆందోళన నెలకొంది. ఇక్కడ ఇలాంటి పనులు జరుగుతున్నాయనేది ఊహించలేదు.. గృహిణులు ఇలాంటివి చేస్తే పిల్లలకు ఏం బుద్ధి వస్తుంది? అంటూ కొంతమంది స్థానికులు మాట్లాడారు. ఇక పట్టుబడిన మహిళల కుటుంబ సభ్యులు మాత్రం మౌనమే వహిస్తున్నారు.

# తెల్లవారు జామున వచ్చే కలలు నిజమవుతాయా?



తెల్లవారు జామున వచ్చే కలలు నిజమవుతాయా అనే ప్రశ్న చాలా కాలంగా ప్రజలలో ఆసక్తిని కలిగిస్తోంది. మన పూర్వీకులు, ఆయుర్వేద మరియు జ్యోతిష్య శాస్త్ర నిపుణులు తెల్లవారుజామున కలలు వాటి ప్రత్యేకతను గురించి వివిధ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అయితే, ఈ విషయంపై సైన్స్ మరియు సాంప్రదాయ విశ్వాసాల మధ్య భిన్నతలు ఉన్నా, తెల్లవారుజామున కలలు చాలా మంది లో ఆసక్తిని రేకెత్తిస్తాయి. 1. ఆధునిక శాస్త్రంలో కలల అర్థం ఆధునిక శాస్త్రం ప్రకారం, మన శరీరం నిద్రలో నాలుగు దశల్లో ఉంటుంది: దశలు 1, 2, 3 మరియు దశ. ఖీఇఓ దశలో మన మెదడు అత్యంత క్రియాశీలంగా ఉంటుంది, ఈ సమయంలోనే కలలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెల్లవారుజామున మెలకువ రావడానికి సమీపంలో మనం ఎక్కువగా ఖీఇఓ దశలోనే ఉంటాం. అందుకే తెల్లవారుజామున కలలు బలంగా గుర్తు ఉండవచ్చు. శాస్త్రవేత్తలు ఈ కలలను అర్థం చేసుకోవడం, భావోద్వేగాలను వదిలించడం లేదా మన లోతైన ఆలోచనలకు సంబంధించిన ప్రతిఫలంగా పరిగణిస్తారు. "కార్తీకమాసంలో వీరి సిరిసంపదలకు నేనే గ్యారెంటీ అంటున్న శనిదేవుడు!" 2. జ్యోతిష్యశాస్త్రంలో విశ్వాసాలు జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, తెల్లవారుజామున వచ్చే కలలు నిజమవుతాయని విశ్వాసం ఉంది. ఇది ముఖ్యంగా రాత్రి 3 గంటల నుండి 5 గంటల మధ్య వచ్చే కలలపై ప్రాధాన్యత ఇస్తుంది. ఈ సమయం బ్రహ్మ ముహూర్తంగా పిలుస్తారు, ఇది ఆధ్యాత్మికంగా పవిత్రంగా పరిగణించబడుతుంది. ఈ సమయంలో మనసు ప్రశాంతంగా, స్వచ్ఛంగా ఉంటుంది. అందుకే ఈ సమయంలో కలలు నిజమయ్యే అవకాశం ఉందని కొందరు నమ్ముతారు. 3. సాంప్రదాయ విశ్వాసాలు ప్రాచీన కాలం నుండి ప్రజలు తెల్లవారుజామున కలలు నిజమవుతాయని విశ్వసించారు. భారతీయ సాంప్రదాయం ప్రకారం, ఈ సమయంలో మనసు ప్రశాంతంగా ఉంటుందని, దీని వలన కలలలో వచ్చే విషయాలు భవిష్యత్‌కు సంబంధించి సూచనలుగా పరిగణిస్తారు. ఉదాహరణకు, సంతోషకర కలలు సంతోషకర ఫలితాలను సూచిస్తాయని, భయానక కలలు కొన్ని హెచ్చరికలుగా భావించవచ్చు. 4. ఆధ్యాత్మిక దృష్టికోణం ఆధ్యాత్మికవాదులు తెల్లవారుజామున కలలు శరీరంలోని ప్రాణశక్తి మరియు మనసు మధ్య ఉన్న సంబంధాన్ని ప్రతిబింబిస్తాయని చెబుతారు. ఈ సమయంలో మన ఆత్మ, లోతైన ఆలోచనలు బయటకు రావడం వల్ల కొన్నిసార్లు భవిష్యత్‌కు సంబంధించిన సమాచారం కలలలో ప్రతిబింబిస్తుందని విశ్వసిస్తారు. "కార్తీక మాసంలో ఏనుగు కుంభస్థలాన్ని బద్దలు కొట్టబోతున్న రాశులు వీరే" 5. వ్యక్తిగత విశ్వాసం తర్కశాస్త్రం ప్రకారం, కలలు అక్షరాలుగా నిజమవుతాయా లేదా అన్నది వ్యక్తిగత విశ్వాసం , ప్రాధాన్యతపై ఆధారపడి ఉంటుంది. మనం కలలను ఎలా అర్థం చేసుకుంటామో, వాటిని ఎలా మన జీవితంలో అన్వయిస్తామో అనేది ముఖ్యమైనది. తెల్లవారు జామున కలలు నిజమవుతాయా అనే ప్రశ్నకు సరైన సమాధానం ఒకటే లేకపోయినా, మన వ్యక్తిగత విశ్వాసాలు, ఆధ్యాత్మిక దృక్పథం, మరియు మన ఆలోచనలపై ఆధారపడి ఉంటుంది.

# ఫ్రెంచ్ ఫ్రైస్‌తో మధుమేహం ముప్పు!



వారానికి మూడు సార్లు బంగాళాదుంపలతో చేసిన ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం 20% పెరుగుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది.ఫ్రెంచ్ ఫ్రైస్‌తో మధుమేహం ముప్పు!వారానికి మూడు సార్లు తింటే వ్యాధి బారిన పడే ప్రమాదం 20 శాతం ఎక్కువవారానికి మూడు సార్లు బంగాళాదుంపలతో చేసిన ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం 20% పెరుగుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అయితే ఉడికించిన లేదా కాల్చిన బంగాళాదుంపలతో అంత ప్రమాదం ఉండదని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. హార్వర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీల పరిశోధకులు ప్రారంభంలో మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ లేని దాదాపు 2 లక్షల మంది నుంచి 40 ఏళ్లపాటు సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈ క్రమంలో 40 ఏళ్ల తర్వాత వారిలో 22,300 మంది డయాబెటిస్ బారినపడినట్టు గుర్తించారు.వారానికి మూడుసార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తీసుకున్న వారిలో మధుమేహం ప్రమాదం 20? పెరిగిందని గుర్తించినట్టు వెల్లడించారు. అయితే కాల్చిన లేదా ఉడికించిన బంగాళాదుంపలు తీసుకున్న వారికి ఎలాంటి సమస్యా ఎదురు కాలేదని పేర్కొన్నారు. బంగాళాదుంపల స్థానంలో తృణధాన్యాలను ఆహారంగా ఇచ్చినప్పుడు మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గినట్టు కనుగొన్నారు. కానీ.. బంగాళాదుంపలకు బదులుగా అన్నం తీసుకున్నవారిలో మధుమేహం ప్రమాదం పెరిగినట్టు గుర్తించారు.

# ఇంటిని అలంకరించడానికి చూడచక్కని స్వదేశీ కళాకృతులు.. వీటికి జీఐ ట్యాగ్ కూడా ఉందండోయ్

పండగలు, ఫంక్షన్లకు ఇంటిని దులిపి, అందంగా అలంకరించడం చాలా మందికి అలవాటు. చాలా మంది ఇంటిని అలంకరించుకోవడానికి వివిధ మార్గాలను ఎంచుకుంటారు. ఇంటిని కొందరు రకరకాల పెయింట్‌లతో నింపేస్తే..మరి కొందరు అందంగా ఫర్నీచర్‌తో అలంకరిస్తారు. ఇంటి అలంకరణకు ఇక్కడ కొన్ని ఐడియాలు సూచిస్తున్నాం.. మీకు నచ్చితే ఫాలో అయిపోండి. ముఖ్యంగా ఇంటి అలంకరణ వస్తువులను కొనుగోలు చేయాలని ఆలోచిస్తే, విదేశీతరహా వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనకండి. స్వదేశంలోనూ ఎన్నో మంచి కళాకృతులు ఉన్నాయి. వాటికి ఉఎ ట్యాగ్ కూడా ఉంది. అవేంటంటే.. పింగ్లా లేదా పురూలియా చిత్రపటం. ఇది ప్రపంచ ప్రసిద్ధి చెందిన కళ. పొడవైన కాగితంపై అందమైన చిత్రాలు ఉంటాయి. వివిధ జానపద కథలు, పౌరాణిక కథలు చిత్రాల రూపంలో ఉంటాయి. వీటికి ఎక్కువగా సహజ రంగులను ఉపయోగిస్తారు. మొదట్లో కాగితంపై వీటిని వేసేవారు. ఇప్పుడు అలంకరణ కోసం బట్టలు, పాత్రలపై కూడా పెయింట్ చేస్తున్నారు. వీటికి ఇతర దేశాల్లోనూ విపరీతమైన డిమాండ్ ఉంది. వీటిని కళాకారులు హస్తకళల ఉత్సవాలలో ప్రదర్శిస్తారు. అనేక షాపుల్లోనూ పురూలియా వస్తువులు ఉన్నాయి. ఈ వాల్‌పేపర్‌లను ఇంటి అలంకరణలో ఉపయోగించవచ్చు.టెర్రకోట కళాకృతులు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి స్థానిక ప్రజలు తమ ఇళ్లను అలంకరించుకోవడానికి, బహుమతులుగా ఇవ్వడానికి బంకురా గుర్రాలను కొనుగోలు చేస్తారు. అలాగే మీ ఇంటిని అలంకరించుకోవడానికి మీరు బంకురాకు వెళ్లాల్సిన అవసరం లేదు. బంకురా నుంచి టెర్రకోట బొమ్మలు ఆన్‌లైన్ లేదా షాపుల్లో కూడా దొరుకుతున్నాయి. ఈ పరిశ్రమకు ఉఎ ట్యాగ్ కూడా వచ్చింది.ఇంటిని వివిధ రకాల డోక్రా విగ్రహాలు, వాల్ ఆర్ట్‌తో అలంకరించుకోవచ్చు. ఈ




డోకారా గృహాలంకరణ వస్తువులను వివిధ ఉత్సవాలు, కొత్త మార్కెట్‌లు. సిటీ గిఫ్ట్ షాపులు, బోటిక్‌లలో కూడా ఉంటాయి. డోక్రా నగలు మహిళలకు ఎంతో ఇష్టం. డోక్రా నగలను ఇతరులకు బహుమతిగా కూడా ఇవ్వవచ్చు.కవి జాసిముద్దీన్ 'నక్షి కంత క్షేత్రం' గుర్తుందా? ఈ నక్షి కాంత ఉఎ ట్యాగ్‌ని పొందిన బెంగాల్ మొదటి హస్తకళ. ఈ పరిశ్రమ 2008లో గుర్తింపు పొందింది. ఇటువంటి రచనలు బీర్భూమ్‌లోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తాయి. ఈ క్రాఫ్ట్ సాధారణ క్లాఫ్ట్ కంటే చాలా క్లిష్టంగా ఉంటుంది. చక్కటి థ్రెడ్ వర్క్‌లో చేస్తారు. పూలు-ఆకులు-జంతువులు-పక్షులు కాకుండా వివిధ రకాల జానపద కథలు ఈ చేతి కుట్లుల్లో కనిపిస్తాయి. చీరల నుండి గృహాలంకరణ వస్తువుల వరకు ప్రతిదాన్ని కళాకారులు ఈ విధంగా రూపొందిస్తారు.

# ప్రకృతి అందాలకు నెలవు ఈ జలదృశ్యం.. సరస్సులు, జలపాతాల మధ్య తేడా ఏంటి..?



సరస్సులు, జలపాతాలు రెండూ సహజమైనవి. కానీ రెండింటి మధ్య తేడా ఏమిటి అని మీరు ఎప్పుడైనా ఆలోచించారా?సరస్సులు , జలపాతాలు రెండూ ప్రకృతి ప్రసాదించిన కానుకలు.అయితే ఈ రెండింటి మధ్య ఉన్న పెద్ద తేడా ఏంటో తెలుసా?వాస్తవానికి, సరస్సు అనేది స్థిరమైన నీటి వనరు, ఇది సాధారణంగా భూమిలో లోతైన ప్రాంతంలో ఉంటుంది. దాని చుట్టూ భూమితో చుట్టుముట్టబడి ఉంటుంది. సరస్సుల నీరు సాధారణంగా స్థిరంగా ఉంటుంది. వాటిలో నీటి మార్పిడి పరిమితంగా ఉంటుంది.సరస్సులు సహజంగా లేదా కృత్రిమంగా ఉండవచ్చు. హిమానీనదాలు, టెక్టోనిక్ కార్యకలాపాలు లేదా నదుల కోత కారణంగా సహజ సరస్సులు ఏర్పడతాయి. మానవ కార్యకలాపాల వల్ల కృత్రిమ సరస్సులు ఏర్పడతాయి.జలపాతం అనేది సహజ నీటి ప్రవాహం, ఇక్కడ నది నీరు ఎత్తు నుండి పడిపోతుంది. తరచుగా ఎత్తు నుండి ప్రవహించే నీరు అని పిలుస్తారు. జలపాతాలు సాధారణంగా ఎత్తైన ప్రదేశాలలో కనిపిస్తాయి.నది నీరు ఎత్తు నుండి కొండలు, గుట్టల ఉపరితలంపై పడినప్పుడు జలపాతాలు ఏర్పడతాయి. ఎత్తులో ఉన్న ఈ వ్యత్యాసం నది ప్రవాహాన్ని ప్రభావితం చేస్తుంది. ఫలితంగా జలపాతం ఏర్పడుతుంది.సరస్సులు, జలపాతాలు రెండూ ముఖ్యమైనవి. అయినప్పటికీ అవి ఏర్పడిన విధానం భిన్నంగా ఉంటుంది.మానవ కార్యకలాపాల వల్ల కృత్రిమ సరస్సులు ఏర్పడతాయి. నదుల కోత కారణంగా సహజ సరస్సులు ఏర్పడతాయి.

# మన దేశంలో అత్యంత విలాసవంతమైన ట్రైన్లు ఇవే.. టికెట్ ధరతో ఏకంగా ఓ కారే కొనొచ్చు



చాలా మందికి రైలు ప్రయాణం అంటే మహాఇష్టం. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే వ్యవస్థ మన దేశంలోనే ఉంది. ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఒక్కసారైనా రైలులో ప్రయాణించకుండా ఉండరు.అయితే రైలు ప్రయాణం ఎంత ఉత్కంఠ భరితంగా, ఆహ్లాదకరంగా ఉన్నా, రైళ్లలోపల మురికి పరిస్థితుల కారణంగా నిత్యం వేలల్లో ఫిర్యాదులు వస్తుంటాయి. అయితే మనదేశంలో ఫైవ్ స్టార్ హోటల్‌ను మించిన కొన్ని రైళ్లు ఉన్నాయని మీకు తెలుసా? అవును.. వారి టిక్కెట్ ధర తెలిస్తే నోరెళ్లబెడతారు. టికెట్ ధరతో మీరే స్వంతంగా ఓ కారు కొనుగోలు చేయొచ్చు.అదే మహారాజా ఎక్స్‌ప్రెస్. ఎఖీఉఆ ద్వారా మహారాజా ఎక్స్‌ప్రెస్ టికెట్ల బుకింగ్ జరుగుతుంది. ఇది మన దేశంలోనే అత్యంత ఖరీదైన రైళ్లలో ఒకటి. ఈ రైలు అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు నడుస్తుంది. ఈ రైలు వివిధ రాష్ట్రాల్లోని దాదాపు 12 ప్రదేశాల గుండా వెళుతుంది. ఈ రైలు ఢిల్లీ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్, ఉదయపూర్, జోధ్‌పూర్, వారణాసి, ముంబై వంటి ప్రాంతాల మీదుగా వెళుతుంది. 12 కోచ్‌లతో కూడిన ఈ రైలు ప్రయాణీకుల సామర్థ్యం కేవలం 88 మంది మాత్రమే. 4 పగలు, 3 రాత్రులకు ఈ రైలులో ప్రయాణించవచ్చు. ఒక ప్రయాణికుడికి డీలక్స్ క్యాబిన్ ధర సుమారు రూ.2.80 లక్షలు. ఇందులో ప్రెసిడెన్షియల్ సూట్ బుక్ చేసుకుంటే అద్దె 12,900 డాలర్లు అంటే దాదాపు పదిన్నర లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. భారతీయ రాజకుటుంబ సభ్యులను కలవడం, జైపూర్‌లో ఏనుగు పోలో మ్యాచ్‌కు హాజరు కావడం, ఖజురహో ఆలయాన్ని సందర్శించడం వంటి అనేక ఈ వెంట్లకు హాజరయ్యే వారు ఇందులో ప్రయాణిస్తుంటారు.మరో లగ్జరీ ట్రైన్ ప్యాలెస్ ఆన్ వీల్స్.. ప్యాలెస్ ఆన్ వీల్స్ రాజస్థాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నడిచే మొదటి లగ్జరీ హెరిటేజ్ రైలు. రాజస్థాన్ రాజస్థాన్ వైభవం ఈ రైలులో ప్రతిబింబిస్తుంది. రైలు లోపలి భాగం రాచరిక సంస్కృతి కనిపిస్తుంది. ఈ రైలును 1982లో ప్రారంభించారు. ఆ సమయంలో ఇది బ్రిటిష్ కాలం నాటి రాజ కోచ్‌లను మోసుకెళ్లేది. ఇందులో అప్పటి రాష్ట్ర పాలకులకు వ్యక్తిగత శిక్షకులు కూడా ఉన్నారు. న్యూఢిల్లీ నుండి ప్రారంభమమై జైపూర్ సవాయి మాధోపూర్, చిత్తోర్‌గఢ్, ఉదయపూర్, జైసల్మేర్, జోధ్‌పూర్, భరత్‌పూర్, ఆగ్రా వంటి నగరాల గుండా ఈ రైలు ప్రయాణిస్తుంది. ఈ రైలులో ప్రయాణించాలంటే సుమారు రూ.3,63,300 టికెట్ కొనుగోలు చేయాలి.దక్కన్ ఒడిస్సీ ట్రైన్ - మహారాష్ట్రలో పర్యాటక ఆకర్షణను పెంచేందుకు దక్కన్ ఒడిస్సీ రైలు ప్యాలెస్ ఆన్ వీల్స్ తరహాలో దీనిని తయారు చేశారు. ఈ రైలు ముంబై నుంచి ప్రారంభమవుతుంది. రత్నగిరి, సింధుదుర్గ్, గోవా, ఔరంగాబాద్, అజంతా-ఎల్లోరా నాసిక్‌తో సహా 10 ప్రసిద్ధ ప్రాంతాల నుంచి వెళుతుంది. ఈ రైలులోని డీలక్స్ క్యాబిన్ ధర రూ.4,76,869 కాగా, ప్రెసిడెన్షియల్ సూట్ ధర రూ.10,32,450. గోల్డెన్ రథం ట్రైన్ - ఈ రైలు దక్షిణ భారతదేశంలోని గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి గుండా వెళుతుంది. 7 రాత్రుల ప్రయాణం. టికెట్ ధర రూ.1,82,000. ఈ రైలు ప్రయాణంలో పచ్చని అడవులు, సుందరమైన జలపాతాల గుండా వెళుతుంది. ప్రయాణ సమయంలో ప్రయాణీకులు రైలు లోపల రాయల్ సేవలను మాత్రమే కాకుండా.. స్పాలు, చికిత్సలు, బార్‌లు, రెస్టారెంట్ సదుపాయం కూడా పొందొచ్చు.





# సినిమా



## చీరకట్టు కవిస్తున్న నిత్యశ్రీ



కంచరపాలెం సినిమాలో చూపించిన సంఘటనల్లో ఒక్కటైనా మన జీవితంలోనూ ఎదురై ఉంటుంది. ఇక కంచరపాలెం సినిమాలోని ప్రతి క్యారెక్టర్ ప్రేక్షకులకు బాగా దగ్గరయింది. అలాగే ఈ సినిమాలో నటించిన చైల్డ్ ఆర్టిస్ట్‌లు గుర్తున్నారా..? చక్కటి నటనతో ఆకట్టుకున్నారు అందరూ. పై ఫొటోలో కనిపిస్తున్న చిన్నది కూడా తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. తన క్యూట్ క్యూట్ నటనతో ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకుంది ఆ చిన్నది. పై ఫొటోలకనిపిస్తున్న చిన్నారి పేరు నిత్యా శ్రీ.. కంచెరపాలెం సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది నిత్యా. ఈ సినిమా తర్వాత పలు సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది నిత్యా. మొన్నమధ్య ధనుష్ నటించిన సార్ సినిమాలో కనిపించింది. ఈ చిన్నారి ఇప్పుడు ఎలా ఉందో తెలుసా..? ఈ అమ్మడు చాలా అందంగా మారింది. హీరోయిన్స్ కు ఏమాత్రం తీసిపోని అందంతో ఆకట్టుకుంటుంది నిత్యా. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది. పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటిస్తుంది ఈ చిన్నారి. అలాగే క్రేజీ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇటీవలే ఓ సినిమాలో హీరోయిన్ గా ఎంపికైందని తెలుస్తుంది. తాజాగా ఈ చిన్నదాని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ ఫోటోల పై మీరూ ఓ లుక్కేయండి. తాజాగా నిత్యా చీరకట్టులో కొన్ని ఫోటోలు వదిలింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. చీరకట్టులో వయ్యారాలు ఒలకబోస్తూ క్యూట్ పోజులు ఇచ్చింది. ఈ ఫోటోల పై కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు

## సోషల్ మీడియా ట్రోల్స్‌కు స్పందించను : చిరంజీవి



సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్‌పై తాను స్పందించనని తెలిపాడు అగ్రనటుడు చిరంజీవి. ఫీనిక్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్‌కి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు నటుడు చిరంజీవి, తేజ సజ్జా. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన ఒక జర్నలిస్ట్ వలన వచ్చిందని ఈ విషయంలో అతడికి ఎప్పుడూ రుణపడి ఉంటానని చిరంజీవి అన్నారు. ఈ కార్యక్రమంకి వచ్చి బ్లడ్ డోనేట్ చేసిన వారందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా నా బిడ్డ లాంటి తేజసజ్జాకు కూడా బ్లడ్ డోనేట్ చేసినందుకు ధన్యవాదాలు. రక్తదానం పేరు చెప్పగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ పుణ్యం. ఈ సందర్భంగా ఒక విషయం మీతో పంచుకోవాలి అనుకుంటున్నాను. ఎవరో ఒకరు రాజకీయ నాయకుడు కారణం లేకుండా నన్ను విమర్శించడం మొదలుపెట్టాడు. నేను ఇప్పుడూ రాజకీయల్లో కూడా లేను. అయిన కూడా అప్పుడప్పుడు విమర్శలు వస్తునే ఉంటాయి. అయితే ఈ నాయకుడు ఒకరోజు ఎదో ముంపు ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ఒక మహిళ అతడిని నిలదీస్తూ.. చిరంజీవిని అలాంటి మాటాలు అనాలని మీకు ఎందుకు అనిపించిందంటూ కడిగి పారేసింది. దీంతో ఆ వీడియో చూసి ఎమోషనల్ అయ్యాను. ఆ తర్వాత ఆమె వివరాలు తెలుసుకోగా.. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిసి నాకు గుండె ఉప్పొగింది. అయితే సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై నేను ఎందుకు స్పందించరంటూ అందరూ నన్ను అడుగుతారు. నేను ఎప్పుడూ స్పందించను. నేను చేసే మంచి పనులు నాపై అభిమానుల ప్రేమే నాకు రక్షణ కవచాలు. విమర్శలపై నేను స్పందించాల్సిన పనిలేదు. నా మంచితనమే మాట్లాడుతుందంటూ చిరంజీవి చెప్పుకోచ్చాడు.

## జూనియర్ ఎన్టీఆర్ సినిమాకు భారీగా ధరలు




జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 చిత్రం. ఈ సినిమా హిందీలో సాధారణ ధరలతో విడుదల కాబోతుండగా, డబ్బింగ్ వెర్షన్ తెలుగులో మాత్రం టికెట్ ధరలను నిర్మాతలు పెంచబోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతి స్టార్ సినిమాకు పెరుగుతున్న టికెట్ ధరలతో పాటు, డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచడం ప్రస్తుతం నెటిజన్ల ఆగ్రహానికి కారణమవుతోంది. ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 సినిమాతో పాటు రజనీకాంత్ నటిస్తున్న కూలీ చిత్రాలు సొంత భాషల్లో సాధారణ టికెట్ ధరల్లోనే ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుండగా.., తెలుగులో ఈ సినిమాలకు టికెట్ ధరలను పెంచబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవే కాకుండా ఇంతకుముందు వచ్చిన చాలా తెలుగు సినిమాలకు కూడా టికెట్ ధరలను పెంచి జనాన్ని థియేటర్లకు రాకుండా చేస్తున్నారు నిర్మాతలు. దీంతో సోషల్ మీడియాలో ఈ అంశంపై తీవ్రమైన ట్రోలింగ్ జరుగుతోంది. “ఒకే సినిమా, ఒకే కంటెంట్, కానీ వేర్వేరు భాషలకు వేర్వేరు ధరలు ఎందుకు?” అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. “ఇది తెలుగు ప్రేక్షకులను దోచుకోవడమే” అని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో తెలుగు సినీ పరిశ్రమ స్పందించాల్సిన అవసరం ఉందని, లేకపోతే ప్రేక్షకులు సినిమా చూడటం మానేసి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడటం పెరుగుతుందని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. ఇది భవిష్యత్తులో తెలుగు సినిమా పరిశ్రమకు చాలా నష్టం కలిగించే అవకాశం ఉందని తెలుపుతున్నారు. గతంలో ఒక సినిమా టికెట్ ధర గరిష్టంగా రూ.150 నుండి రూ.200 వరకు ఉండేది. కానీ ఇప్పుడు కొత్తగా విడుదలయ్యే ప్రతి స్టార్ సినిమాకు టికెట్ ధరలు రూ.300 నుండి రూ.400 వరకు చేరుకున్నాయి. కొన్ని మల్టీప్లెక్స్‌లలో అయితే మొదటి వారం టికెట్ ధరలు రూ.500 వరకు కూడా పెంచుతున్నారు. ఈ ధరలు సామాన్య ప్రేక్షకుడికి చాలా భారంగా మారాయి. దీంతో కుటుంబంతో కలిసి సినిమా చూడాలంటే దాదాపు రూ.2 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది

## వరుస ఫ్లాప్స్‌తో కనిపించకుండాపోయిన హీరోయిన్

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా రాణించిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడి గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. తన అందంతో, నటనతో తెలుగు ప్రజలను కట్టిపడేసింది ఈ చిన్నది. 18 ఏళ్ల వయసులో కాలేజీలో చదువుతున్నప్పుడే మోడలింగ్‌లో కెరీర్ ప్రారంభించి 2009లో కన్నడ చిత్రం ‘గిల్లి’తో తన హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. ఆ తరువాత 2011 కెరటంలో సిద్ధార్థ్ రాజ్‌కుమార్ సరసన నటించింది, ఇది తెలుగు మరియు తమిళ భాషలలో విడుదలైంది. ఆ తరువాత తెలుగులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో భారీ పాపులారిటీ అందుకున్న రకుల్ ప్రీత్ సింగ్, ఆ తర్వాత చాలామంది స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. ఇదిలా ఉండగా ఇటీవలే తాను ప్రేమించిన ప్రముఖ బాలీవుడ్ నటుడు నిర్మాత అయిన జాకీ భగ్నానీ నీ ప్రేమించి మరీ వివాహం చేసుకుంది. ఒకవైపు సినిమాలలో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ వలకబోస్తూ అందాల ఆరబోతతో యువతకు చెమటలు పట్టించే ప్రయత్నం చేస్తోంది. కానీ తెలుగులో సినిమాలు తగ్గించింది ఈ వయ్యారి భామ. తెలుగులో రకుల్ నటించిన లాస్ట్ ఎనిమిది సినిమాలు వరుసగా ఫ్లాప్ అయ్యాయి. దాంతో ఈ చిన్నదానికి ఆఫర్స్ తగ్గాయి. దాంతో ఈ చిన్నది సోషల్ మీడియాలో పోస్ట్ లు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అలాగే హిందీలోనూ సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. ఇప్పుడు ఈ బ్యూటీ సినిమాల పరంగా సైలెంట్ అయ్యింది. సినిమాల్లో బిజీగా లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను పలకరిస్తుంది రకుల్. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని ఫోటోలను వదిలింది ఈ వయ్యారి భామ.

వైరల్ అవుతుండడంతో సుధీర్ బాబు అభిమానులు ఫుల్ ఖుష్ అవుతున్నారు.



## అంచనాలు పెంచుతున్న మంచు మనోజ్ సినిమా టైటిల్

టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో



పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా “డేవిడ్ రెడ్డి” అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి. ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. “మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు. ఢిల్లీలో పెరిగాడు. ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే “డేవిడ్ రెడ్డి”లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు. సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఓక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. 21 టైటిల్ ‘డేవిడ్ రెడ్డి’. ఇది 1897..1922 నేపథ్యంలో సాగే తీవ్రమైన చారిత్రక యాక్షన్ డ్రామా” అని చిత్రబృందం తెలిపింది. తాజాగా రిలీజ్ అయిన పోస్టర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది. మనోజ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమా మనోజ్‌కి కంబ్యాక్ హిట్ ఇస్తుందా? అసలు “డేవిడ్ రెడ్డి” అనే పాత్రలో మనోజ్ ఎలా కనిపిస్తారు? అనేది తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

## చిరంజీవి బర్త్‌డేకు 157 సినిమా ఫస్ట్ లుక్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు చిరంజీవి కొత్త సినిమాను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటీవలే ‘సంక్రాంతికి వస్తున్నాం’తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడితో తన కొత్త ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టాడు. మెగా 157 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. అయితే ఈ ప్రాజెక్ట్ నుంచి తాజా అప్‌డేట్ ఒకటి బయటకి వచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా టైటిల్‌తో ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. చిరంజీవి ఈ చిత్రంలో తన నిజమైన పేరు శంకర్ వరప్రసాద్ పాత్రలో కనిపించనున్నారు.



## నత్తారామేశ్వరం శ్రీరామేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ ఆదాయం రూ.4,69,370



పెనుమంట్ర : ఆగష్టు 08, నత్తా రామేశ్వరం శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానం వైశాఖ మాసం తరవాత గురువారం హుండీ లెక్కించినట్లు ఆలయ నిర్వహణ అధికారి పులగల వేణుగోపాలరావు అన్నారు . ఉ దయం 9.00 గంటలకు దేవ దాయ ధర్మ శాఖ తనిఖీదారు తణుకు వారు, కార్యనిర్వహణాధికారి వారు, అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు సేవ సమితి వారు పాల్గొగా హుండీ ఆదాయం రూ.4,69,370 లు వచ్చినట్లు తెలిపారు. గతం లో 9నెలల 7రోజులకు రూ. 4, 83,180 వచ్చినట్లు తెలిపారు.

## గ్రీన్ ఎకో ఎలక్ట్రికల్ బైక్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

### కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రికల్ బైక్ లు ఎంతో ఉపయోగకరం .. ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం ఆగస్టు 08 రానున్న కాలంలో పెట్రోల్ తో నడిచే బైక్ లు కన్నా పర్యావరణం కాలుష్యం కాకుండా ఉండే ఎలక్టికల్ బ్యాటరీ బైక్ లు ఎంతో ఉపకరిస్తాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం – విస్సాకోడెరు రోడ్డులో గ్రీన్ ఎకో ఎలక్ట్రికల్ బైక్ షోరూంను శుక్రవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఎలక్ట్రికల్ బైక్ లు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని, కాలుష్యాన్ని తగ్గిస్తుందని అన్నారు. షోరూం నిర్వాహకులు వేంద్ర బాల, వై శ్రావణి మాట్లాడుతూ గ్రీన్ ఎకో ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో రూ లక్ష కే 3 ఎలక్ట్రికల్ బైక్ లను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎలక్ట్రికల్ బైక్ లను ఎమ్మెల్యే అంజిబాబు పరిశీలించిన వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

## వివిధ రకాల పంటల అభివృద్ధిపై పోషకాల ఆవశ్యకత

తాడేపల్లిగూడెం ఆగస్టు 8 పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకటరామన్న గూడెం డాక్టర్ వైయస్సార్ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్యాక్స్ వారి ఆర్థిక సహాయంతో సమగ్ర పోషక యాజమాన్యం పై 15 రోజుల శిక్షణ కార్యక్రమము మూడవ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ పి ఉషారాణి ప్రొఫెసర్ అండ్ హెడ్ వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం వారు వివిధ పోషకాలు ఆవశ్యకత మొక్కలు మరియు వివిధ పంటలలో వాటి నిధులను గూర్చి వివరించారు. ప్రధాన ద్వితీయ మరియు సూక్ష్మ పోషకాలు ఏఏ మోతాదులో ఏ పంటకు ఎంత వాడాలో తెలియజేశారు. విచక్షణ రహితంగా మోతాదులను మించి ఎరువులు వాడకం వలన నేల కలుషితం అవ్వడమే కాకుండా అనవసర పెట్టుబడి అయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. డాక్టర్ బి. పెద్దబాబు సీనియర్ శాస్త్రవేత్త, నేలల పరిరక్షణ మరియు సంతృత పర్యావరణం మరియు జీవన వైవిధ్యము ఏ విధంగా ప్రభావితం అవుతుందో వివరించారు. ఈ కార్యక్రమానికి పలువురు నిర్దేశించబడిన ప్యాక్స్ సభ్యులు హాజరయ్యారు.



## వరసు సెలవులతో గ్రామాలకు జనాలు

### ఆర్టీసీ బస్టాండ్లలో పడిగాపులు

హైదరాబాద్,ఆగస్ట్8 ఈ నెల 9వ తేదీ శనివారం రాఖీ పండుగ నేపథ్యంలో అక్కాచెల్లెళ్లు తమ సోదరుల వద్దకు వెళ్లేందుకు పయనమయ్యారు. దీంతో ఆడబిడ్డలందరూ ఆయా బస్టాండ్లకు చేరుకుంటున్నారు. కానీ సరిపడా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో జిల్లాలకు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. కానీ బస్సులు సమయానికి రాకపోవడంతో ఆర్టీసీ అధికారులపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. పండుగల వేళ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు- చేయాలని శుక్రవారం, రేపు రాఖీ పండుగ, ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు కూడా తమ సొంతూర్లకు వెళ్లేందుకు బస్టాండ్లకు చేరుకోవడంతో బస్టాండ్ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి

## శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు కుట్టు మిషన్లు పంపిణీ


పాలకొల్లు: ఆగస్టు 8,(స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాజరాజేశ్వరి అధ్యక్షతన మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణా తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు కుట్టు మిషన్లను డబ్ల్యూ. ఎఫ్.ఎఫ్.ఐ నర్సాపురం వారి సహకారంతో ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా టి రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థినిలు చదువుతోపాటు నైపుణ్యాలతో కూడిన మూడు నెలల టైలరింగ్ విద్యను అభ్యసించడం వలన కాలేజీ ఫీజులు, పరీక్ష ఫీజుల కోసం తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడి తాము నేర్చుకున్న టైలరింగ్ ద్వారా తనతో పాటు



కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. 18 మంది విద్యార్థినులు శిక్షణను పూర్తి చేసుకున్న వారిలో 11 మంది విద్యార్థినులకు కుట్టుమిషన్లు అందజేశారు.మరియు ఇంకొక వారంలో ఎంబ్రాయిడరీ ని కూడా ప్రారంభిస్తామని తెలియజేసారు.కుట్టు మిషన్ అందుకున్న విద్యార్థిని ఎం.నవ్య మాట్లాడుతూ ప్రిన్సిపాల్ మాకు చదువుతోపాటు టైలరింగ్ శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి పూర్తి చేసిన వారికి కుట్టు మిషన్లను డబ్ల్యూ. ఎఫ్. ఎఫ్ ఐ సహకారంతో అందించి మా కాళ్ళపై నిలబడి స్వయంగా బతకడానికి మరియు ఇతరులకు సహాయపడటానికి ఈ శిక్షణ ఎంతో ఉ పయోగపడిందన్నారు.ప్రిన్సిపాల్ కి,అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు.అలాగే మరొక విద్యార్థిని పి. మేఘన మాట్లాడుతూ ప్రిన్సిపాల్ ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణా తరగతుల ద్వారా నేను జాకెట్ పంజాబీ డ్రెస్, గౌను, స్కర్ట్, వంటి కటింగ్ నేర్చుకొని నా డ్రెస్ లను నేను కుట్టుకోవడానికి సహాయపడింది అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి. కృష్ణ, ఐ.క్యు. ఎ సి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, క్రమశిక్షణా కమిటీ కన్వీనర్ డా బూసి వెంకట స్వామి, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ ఎం. రామకృష్ణ, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ బి. కే. వి. రామలక్ష్మి,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు

## మొక్కల విత్తనాలచే రక్షాబంధన్ తయారు చేసిన శ్రీ ఏ యస్ యన్ యం ప్రభుత్వ కాలేజి విద్యార్థులు....




పాలకొల్లు :ఆగస్టు 8,స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు రాఖీ పండగ సందర్భంగా పర్యావరణ హితమైన వివిధ రకాల మొక్కల విత్తనాలతో రాఖీలు తయారు చేసారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థుల యొక్క పర్యావరణ స్పృహ ను అభినందిస్తూ ఈ రాఖీలలో ఉపయోగించిన విత్తనాలు రాఖీలను పడవేసిన తరువాత మొలకెత్తి పర్యావరణ సమగ్రతను కాపాడతాయని,రైతుల కష్టం,మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఉన్నాయని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ ఐక్య సి కోఆర్డినేటర్ కె భద్రాచలం అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి యామిని, జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం రామకృష్ణ మరియు వృక్షశాస్త్ర అధ్యాపకులు శ్రీ పి శ్రీనివాసరావు,తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి , శ్రీమతి వి శిరీష మరియు ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులు తయారు చేసిన రాఖీలను ప్రదర్శించారు.

## మావుళ్ళమ్మ అమ్మవారికి 108 గ్రాముల బంగారు పుష్పాలు అందజేత

### త్వరలోనే అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తాం .. ఎమ్మెల్యే పి



భీమవరం ఆగస్టు 08 త్వరలోనే భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రావణ శుక్రవారం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన అమ్మవారి భక్తులు 108 గ్రాముల బంగారు పుష్పాలను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ కు అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ అమ్మవారి స్వర్ణ వస్త్రానికి దాతలు ముందుకు వస్తున్నారని, సుమారు మరో 25 కేజీల బంగారం కావాల్సి ఉందని, రాష్ట్రంలోనే పేరుగాంచిన మావుళ్ళమ్మ అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని తయారు చేస్తామని అన్నారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు.మావుళ్ళమ్మ ను దర్శించుకున్న ఎమ్మెల్యే అంజిబాబు వరలక్ష్మి వ్రతం శ్రావణ శుక్రవారం సందర్భంగా భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని సుమారు 8 లక్షల గాజులతో అలంకరణ చేశారు. గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని ఎమ్మెల్యే అంజిబాబు దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి లక్షల్లో గాజులను అందించడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ధర్మవరం పట్టణంలో విద్యుత్ సరఫరా బంద్

### విద్యుత్ ఏడి. లక్ష్మీనరసింహారెడ్డి.

ధర్మవరం ఆగస్టు 08 ధర్మవరం పట్టణంలో ఈ నెల 9వ తేదీ అనగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏడి లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని రామ్ నగర్ లో గల 132/ 11 కెవి సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల ఉన్నందున, అత్యవసరంగా విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు. కావున పట్టణ ప్రజలు, వినియోగదారులు సహకరించాలని వారు తెలిపారు.

## పాములపర్రు గ్రామంలో పుంత రోడ్డు సమస్య పరిష్కారం



ఉండి మండలం, పాములపర్రు గ్రామంలో పుంత రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఏర్పడిన వివాదాన్ని గ్రామ పెద్దలతో చర్చించి పరిష్కరించిన సిఐ ఇతర ప్రాంతాల నుండి ఎవరైనా ఇక్కడకు వచ్చి శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తే, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు.ఉండి మండలం, పాములపర్రు గ్రామంలో పుంత రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఏర్పడిన వివాదాన్ని గ్రామ పెద్దలతో చర్చించి పరిష్కరించడం జరిగిందని ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జగదీశ్వర రావు తెలిపారు. ఈ వివాదంపై స్థానిక అధికారులు మరియు గ్రామ పెద్దలు చర్చించి ఒక పరిష్కారానికి వచ్చారన్నారు.రీ-సర్వేకు ముందు ఆర్.ఎస్.నెం. 201-1 మరియు 200-3లలో 0.82 సెంట్లుగా ఉన్న భూమి, రీ-సర్వే తర్వాత ఎల్.పి.యం. నెం. 344 మరియు 345లలో 0.87 సెంట్లుగా నమోదైంది. ఈ భూమిలో 0.45 సెంట్లను దళితుల స్మశానవాటిక కోసం కేటాయిస్తూ 2023లో అప్పటి తహశీల్దార్, ఉండి వారు పాములపర్రు పంచాయతీకి స్వాదీన ధృవీకరణ పత్రం అందించారు. మిగిలిన 0.42 సెంట్లలో రోడ్డు మార్గాన్ని అభివృద్ధిచేయాలనినిర్ణయించారు.అయితే, ఇటీవల రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేపట్టినప్పుడు, కొంతమంది గ్రామస్తులు స్మశానవాటికలో రోడ్డు నిర్మిస్తున్నారని అపోహపడి సర్వేను అడ్డుకున్నారు. ఈ విషయంపై గ్రామ పెద్దలతో చర్చించిన ఉండి తహశీల్దార్ గారు మరియు ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఈ విషయాన్ని వారికి స్పష్టం చేశారు. స్మశానవాటికకు కేటాయించిన 0.45 సెంట్లలో ఎటువంటి రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని, మిగిలిన 0.42 సెంట్లలో మాత్రమే రోడ్డు నిర్మిస్తున్నారని వివరించారు.పాములపర్రు మరియు కోలమూరు గ్రామాలకు చెందిన పెద్దలను పిలిచి ఈ విషయంపై అవగాహన కల్పించారు. వారందరూ అధికారుల వివరణతో సంతృప్తి చెంది ఒక ఒప్పందానికి వచ్చారు. అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో, ఎవరికీ ఎటువంటి ఇబ్బంది

### ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జగదీశ్వర రావు

లేకుండా పుంత రోడ్డు నిర్మాణం జరుగుతుందని అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం అక్కడశాంతిభద్రతల సమస్యలు లేవని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగడం లేదని తెలిపారు.ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జగదీశ్వర రావు మాట్లాడుతూ, "ఇతర ప్రాంతాల నుండి ఎవరైనా ఇక్కడకువచ్చిశాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.

## సేంద్రియ ఎరువులపై అనాసక్త

### రసాయన వాడకాలతో భూసారానికి ముప్పు

వరంగల్,ఆగస్ట్8: సేంద్రీయ ఎరువుల వాడకం పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా రైతుల్లో అవగాహన కల్పించకపోవడంతో కనీసం నిర్దేశిరచిన లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోతున్నారు. అధికారులు దృష్టి సారించకపోవడంతో కనీస లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గుంతల నిర్మాణం చేపట్టుకుంటే రైతులకు వ్యయం భారం తగ్గడమే కాకుండా సేంద్రీయ ఎరువులను తయారు చేసుకోవచ్చని అధికారులు అన్నారు. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరక పోవడంతో పాటు రైతులకు ప్రయోజనం లేకుండా పోతుంది.పంట పొలాల్లో రసాయనిక ఎరువులు తగ్గించాలని ప్రచారం చేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉచితంగా రైతులకు ఉపాధి హామీ ద్వారా నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల పర్యవేక్షణతోపాటు నిర్లక్ష్యంలో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం రైతుల ఇళ్లలో నాడేప్ కంపోస్టు గుంతల కింద గుర్రపు నాడల గుంతల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించినా ఎక్కడా పూర్తి కాకపోవడంతో లక్ష్యం చేరుకోలేక పోతున్నారు. గుంతలను సద్వినియోగం చేసుకుంటే రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా మారనుంది. సేంద్రీయ ఎరువు తయారీ చేయుటకు రైతుల భూమిలోని చెత్తను, ఇళ్ల పరిసరాల్లోని చెత్తను కంపోస్టు గుంతలో ఒకసారి మూడు వరసలో చెత్తను వేసి చేసుకునేలా సూచనలు చేస్తున్నారు. గుంత నింపిన తరువాత దానిపై గోనె సంచులు వేసి ప్రతి రోజు ఉ దయం, సాయంత్రం నీళ్లు చల్లుతూ ఉండాలి. ఇలా మూడు, నాలుగు నెలల్లో సేంద్రీయ ఎరువు తయారవుతుంది. ఇలా ఎరువు తయారీ చేసుకోవడంతో రసాయనిక ఎరువులను తగ్గించడమే కాకుండా భూసారాన్ని పెంచుకుని అధిక దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కంపోస్టు గుంతల నిర్మాణాలపై ఇప్పటికే అవగాహన కల్పించారు. అయినప్పటికీ రైతులు ముందుకు రావడంలేదు. మరింత అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# గొండు.శంకర్ ప్రజాదర్బార్ కు, వినతుల వెల్లువ

**ప్రతీ సమస్యకు, పరిష్కారమార్గం**

**శాసనసభ్యులు గొండు.శంకర్**



శ్రీకాకుళం(విజయసారథి):ప్రతీ సమస్యకు, పరిష్కారమార్గం చూస్తానని, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు. శంకర్ శుక్రవారం అన్నారు. స్థానిక విశాఖ కోలనీ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కు, ఊహించని వినతులు శుక్రవారం అందాయి. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నారనే కథనంతో శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార, ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వము ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తుందని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, రూరల్, గార, పరిసర గ్రామ ప్రజలు, టీడీపీ నగరనాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్చార్జ్, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం రైతన్నల ఎదురుచూపులు

**-కనికరించని కూటమి ప్రభుత్వం**

**పాటంశెట్టి సూర్యచంద్ర జగ్గంపేట**

**ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి**



కాకినాడ(విజయసారథి): కాకినాడ జిల్లాజగ్గంపేట నియోజకవర్గంలో పుష్కర ఆయకట్టు రైతులను కాకినాడ జిల్లా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ మోసం చేశారని, నేడు పుష్కర ఆయకట్టు రైతులు అగమ్య గోచరంగా అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.ఎన్ని కల ముందు ఓటేసి గెలిపించండి గెలిచిన వెంటనే పుష్కర తాళ్లూరు లిఫ్ట్, పైపులైను పూర్తిగా మార్చి సాగునీరు అందిస్తానని వాగ్దానాలు చేసి గద్దెనెక్కేక ఈ ఒక్క పంటకు విరామం ఇవ్వండి నిధులు తెస్తాను,పనులు చేయిస్తాను వచ్చే పంటకు పూర్తిస్థాయిలో నేను నీరిస్తాను అని నమ్మబలికిన శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ గారు పుష్కర రైతులను మోసం చేశారని సూర్యచంద్ర ఆరోపించారు. గత సంవత్సరంలో ఈ ఒక్క పంటకి ఆగండి వచ్చే పంటకు తప్పనిసరిగా నీరిస్తాను అన్న ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూ మాటలు నమ్మి గత నెల రోజుల నుండే పుష్కర ఆయకట్టుకి సంబంధించిన అన్ని గ్రామాలలో రైతులు పంటలకు పెట్టుబడి పెడుతున్నారని వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారని పుష్కర నీరు రాకపోవడం వల్ల వేసిన పంటలు, నారుమడులు ఎండిపోయి రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.సాగునీరు ఇవ్వలేనప్పుడు పంటకాలాని కంటే ముందుగానే బాధ్యత కలిగిన శాసనసభ్యునిగా సంబంధిత అధికారులతో కలిసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించ వలసిన అవసరం ఉందని అలా చేయకుండా ఇదిగో గ్రాంట్ తెస్తున్నాను, అదిగో గ్రాంట్ తెస్తున్నాను అని 14 నెలల నుండి కాలయాపన చేస్తూ రైతులను మోసం చేసి రైతన్నలను నట్టేట ముంచారని పాటంశెట్టి సూర్యచంద్ర ఆక్షేపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి కనీసం రెండు కోట్ల రూపాయలు నిధులు తెచ్చి పాడైన పైప్లైన్లు, మోటార్లు రిపేర్లు చేయించి ఈ సంవత్సరం పంట గట్టెక్కించాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు. సాగునీరు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ రైతులకు నీరు ఇవ్వకుండా అన్యాయం చేస్తే రైతులు పక్షాన అండగా నిలబడి రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామని సూర్యచంద్ర స్పష్టం చేశారు.

# 11న బిజెపిలోకి గువ్వల బాలరాజు

**ఐదుగురు ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు**

**తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు**

హైదరాబాద్,ఆగస్ట్ 8: బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరబోతున్నారు. ఇప్పటికే ఈ విషయం ప్రకటించారు. అయితే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు బాంబు పేల్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఆ ఎమ్మెల్యేలు ఎవరనేది త్వరలో చెబుతామన్నారు. ఆ ఎమ్మెల్యేలు.. మా పార్టీలో చేరే తేదీలు సైతం తెలియజేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్‌తో రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేక తమ వైపు వారు చూస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలే కాదని.. ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు.

# ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలి

**న్యూఢిల్లీలో నేషనల్ హార్టికల్చర్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసిన**

**అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**



అనంతపురం( విజయసారథి):అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం న్యూఢిల్లీలో నేషనల్ హార్టికల్చర్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియారంజన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమగ్ర ఉద్యానవన అభివృద్ధి మిషన్ కింద అనంతపురం జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించి, వీటిని వేగవంతం చేయాలని సూచించారు .ఈ చర్చలో భాగంగా గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం రూ.505 కోట్లలో సుమారు రూ. 300 కోట్లు విడుదల చేయకపోయిన విషయాన్ని అధికారులు వెల్లడించగా, ఇది సరికాదని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే కుప్పంలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ) ను అనుసరించి, చిత్తూరు జిల్లా కుప్పం, పల్నాడు, అరకు ప్రాంతాల్లో కొత్తగా సిఓఈలు ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం ఇచ్చారు.ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలో అరటి, పప్పాయ, చీనీ, దానిమ్మ, జామ, సపోటా, టమాటో వంటి ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ఎంపీ అధికారులను కోరారు.అంతేకాకుండా, రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజీలు, పోస్ట్ హార్వెస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు వంటి పెండింగ్ ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని, తద్వారా రైతులకు మార్కెట్ లింకేజీలు మరియు విలువ జోడింపు అవకాశాలు కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.రైతుల అభ్యున్నతి మరియు ఉద్యానవన రంగ అభివృద్ధి పట్ల ప్రభుత్వం నిబద్ధతతో ఉండాలని, అనంతపురం జిల్లా ఉద్యానవన రంగంలో ముందంజ వేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పష్టంచేశారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తాం

**గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరణ**



నిమ్మాడ(విజయసారథి):ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు అన్నారు. శుక్రవారం టెక్కలి నియోజకవర్గం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతలు స్వీకరించారు.ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయి. నూతన ఫించన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయి.త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని ప్రజలకు వివరించారు.ప్రజల నుంచి వచ్చిన వినతలు పరిశీలించి సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి త్వరిగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధులలో అలసత్వం లేకుంగా అధికారులు పనిచేయాలని సూచించారు.

# పర్యాటక మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్ మెంట్ కోర్సులు

**ఆసక్తి గల వారు ఈనెల 13 లోగా దరఖాస్తు చేసుకోవాలి**

నంద్యాల(విజయసారథి):కేంద్ర,రాష్ట్ర పర్యాటక శాఖలచే సంయుక్తంగా తిరుపతి కేంద్రములో నిర్వహించబడుతున్న "స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజి మరియు అప్లైడ్ న్యూట్రిషియన్ నందు 2025-26 సంవత్సరమునకు హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు నంద్యాల జిల్లాలో ఆసక్తి గలవారి నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజి మరియు అప్లైడ్ న్యూట్రిషియన్ కళాశాల లెక్చరర్ ఎన్.శివరామకృష్ణ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీలోగా కళాశాలకు అందేలా పంపాలన్నారు.హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల వివరాలు: -1.బి.యస్.సి (హెచ్ ఢ హెచ్.ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్- వారి నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. ఈ కోర్సులో నేర్పించి 4నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును. 2. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ ఢ పెటిసరి కోర్సుకు యస్.యస్.సి. పాసైన వారి నుండి ధరఖాస్తులు కోరుచున్నాము. ఈ కోర్సులో ఒక సంవత్సరము పాటు దేశ విదేశాల వంటకములు నేర్పించి 6నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును. 3. సర్టిఫికేట్ కోర్స్ ఇన్ ఫుడ్ ఢ బేవరేజ్ సర్వీస్ కోర్సుకు యస్.యస్.సి పాసైన వారి నుండి ధరఖాస్తులుకోరుచున్నాము. ఈ కోర్సులో ఐదు నెలల పాటు రెస్టారెంట్ మరియు బార్ సర్వీస్ నేర్పించి 1 నెల ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును.పై కోర్సులకు వయో పరిమితి లేదుఈ కోర్సులు పూర్తి అయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్ళు, మరియు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్ళ లలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడును. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం కూడా కలదు.ఈ సంస్థ యొక్క ధరఖాస్తులు మరియు ఇతర ఏదైనా సమాచారం కొరకు సెల్ నెం. 9701343846, 9100558006 ఢ 9502113163 నెంబర్లను సంప్రదించవలెను.వెబ్సైట్ నందుపూరించిన ధరఖాస్తులను 13.08.2025 లోపు స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజి మరియు అప్లైడ్ న్యూట్రిషియన్ కళాశాల, ఎస్వి జూ పార్క్ దగ్గర, ఏపీ టూరిజం ట్రాన్స్పోర్ట్ యూనిట్ పక్కన, పేరూరు గ్రామం పెరుమాళ్ళపల్లి పోస్ట్, తిరుపతి 517505 చిరునామాకు పంపించవలనని కళాశాల లెక్చరర్ ఎన్ శివరామ కృష్ణ చౌదరి ఆ ప్రకటనలో వెల్లడించారు.

# దేశభక్తిని చాటిచెప్పేలా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాలు

**12న బీచ్ రోడ్డులో హర్ ఘర్ తిరంగా యాత్ర.**

**ప్రజలంతా ఇందులో భాగస్వామం కావాలి**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కార్యక్రమాల నిర్వహణపై జిల్లా అధికారులకు**

**బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు**



.విశాఖపట్నం(విజయసారథి):భారత స్వాతంత్ర్యానికి 79 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, కేంద్ర పర్యాటక సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య స్ఫూర్తిని కాపాడుతూ దేశభక్తిని చాటిచెప్పేలా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాలను ఆగస్టు 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా జిల్లలోనూ జాతీయ పతాకం ప్రాముఖ్యతను, స్వాతంత్ర్య పోరాటంలో, దేశ ప్రజలను సమైక్యంగా ఒక్క తాటిపై నిలిపి ఉంచడంలో జాతీయ జెండా భూమికను తెలిపే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు వెల్లడించారు. జాతీయ పతాకాన్ని ఎగరేయడం ద్వారా దేశభక్తిని వ్యక్తం చేయడం, జాతీయ పతాకంపై వ్యక్తిగత అనుబంధాన్ని మరింతగా పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఆగస్టు 8 నుంచి 13 వరకు 'తిరంగా యాత్ర', 'తిరంగా సెల్ఫీలు', 'తిరంగా ట్రిబ్యూట్', 'తిరంగా మేళా' వంటి కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఆగస్టు 12న ఉదయం 7 గంటలకు నగరంలోని బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు భారీ ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. థింసా, కోలాటం వంటి కళా రూపాల ప్రదర్శనతో తిరంగా యాత్ర జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు దేశ భక్తి గేయాలు, చిత్రలేఖనం, తిరంగా రంగోలి, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.ఏజివిఎంసి పరిధిలో పబ్లిక్ మోటివేషన్, అవగాహన కార్యక్రమాలకు యూసిడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాధ్యత వహిస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో జడ్పీ సీఈఓ ఆధ్వర్యంలో గ్రామ/వార్డ్ సచివాలయ సిబ్బంది ఇంటింటా జాతీయ పతాకంతో సెల్ఫీలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారని శుక్రవారం ఇచ్చిన ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు పర్యాటక, సాంస్కృతిక అధికారి సమన్వయం వహిస్తారని.. అన్ని విభాగాల అధికారులు భాగస్వామ్యం అయ్యి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# జగన్ అరెస్ట్ ఖాయం.. బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

రాజమండ్రి: గత 78 ఏళ్లలో ఎప్పుడులేని విధంగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి పూర్తి సహకారం అందిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఏపీ అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.ప్రజలు తనను ఓడించినందుకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాకూడదనే మనస్తత్వంతో మాజీ సీఎం జగన్ ఉన్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని జగన్ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ తానే అధికారంలోకి వస్తానన్న భ్రమలో జగన్ ఉన్నారని ఎద్దేవా చేశారు.



# అలీబాబాద 40 దొంగలు

**కెసిఆర్ కుటుంబానికి ఇది సరిపోతుంది**

**అప్పులు చేసి దోచుకోవడంలో అందవేసిన చేయి**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి**

హైదరాబాద్,ఆగస్ట్ 8: తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. అప్పులుల తెచ్చి అప్పుల్లోనూ కమిషన్లు దండుకున్న ఫ్యామిలీ వారిదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com